ISSN 0971-278X

ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

పోలీసోడా!

— బి. పాండురంగారెడ్డి

ఎర్రటోపి పెట్టినావు.... పోలీసోడా
బోటకట్టె పట్టినావు ”
కాకి గుడ్డల్ కట్టినావు ”
బందూకు పట్టినావు ”
॥ఎర్రటోపి....॥

పేదోల్ల పట్టుకొచ్చి.... పోలీసోడా
ఎంకలిరుగ తన్నుతావు ”
మీ అమ్మ నాన్నలెవరు ”
బీదోల్లని మర్సిపోతివ ”
పేదింట పుట్టి నీవు ”
కట్టాల్లో పెరిగి నీవు ”
పేదోల్ల సెత్రువైతివ ”
పెద్దోల్ల బంటువై తివ ”
॥ఎర్రటోపి....॥

సర్కోల్ల జూత్తె నువ్వు ...పోలీసోడా
వొంటి కాలి మీదొత్తవ్ ”
పసువుల్ల జూత్తవేంర ”
బాది బాది సంపుతావు ”
ఆడోల్ల జూత్తె నీకు ”
రిమ్మ తెగులు పుడ్తదేందర ”
బూతు కూతలు కూత్త వేందర ”
నీ కమ్మలక్కలు లేరేంర ”
॥ఎర్రటోపి....॥

దొరల దోపిడి తట్కలేక.... పోలీసోడా
బీద బిక్కి వొక్కటైతె ”
తండు తండు వూర్ల కొచ్చి ”
మాన పానం దీత్తరేంర ”
బిడ్డలను పట్కపోయి....
పట్ట పగలె హింసించి ”
పిట్టలల్లె కాల్తరేంర ”
మా పాలిటి యమభటులె ”
॥ఎర్రటోపి....॥

మీసాల రెడ్లంత.... పోలీసోడా
గూండాల గుంపుల్తో ”
బాంబులు బల్లేలు పట్టి ”
జీపుల్లో తిర్గుతుంటె ”
ఆడబిడ్డల సెరుత్తుంటె ”
హత్తెలెన్నొ సేత్తుంటె ”
మీ కాల్లు సేతులు ఆడనేంది ”
ముచ్చెమటలు పోత్తవేంది ”
॥ఎర్రటోపి....॥

KRSADIM303

ప్రజాసాహితి

సంపుటి : 17 సంచిక : 12

153 జూలై 1994

ప్రజాసాహితి కార్యాలయం,
29-28-67, దాసరివారివీధి,
సూర్యారావుపేట,
విజయవాడ - 520 002.

రచనలు పంపవలసిన చిరునామా :
నిర్మలానంద,
వర్కింగ్ ఎడిటర్, ప్రజాసాహితి,
7-1-23, తమిళ్ స్ట్రీట్,
చినవాల్తేరు,
విశాఖపట్నం - 530 023.

ఏజంట్లు, చందాదారులు
వ్రాయవలసిన అడ్రస్
ఇతర వివరాలకు :
కొత్తపల్లి రవిబాబు,
ప్రధాన కార్యదర్శి,
జనసాహితి, నగరం-522 268
గుంటూరుజిల్లా

రెండవ కవరు పేజీ :
పోలీసోడా! (కవిత)
— వి. పాండురంగా రెడ్డి

మూడవ కవరు పేజీ :
హృదయించిన ప్రశ్న (కవిత)
— అల

నాల్గవ కవరు పేజీ :
మాకు యుద్ధమే జీవితం ! (కవిత)
— రాధేయ

ఈ సంచిక వెల : రు. 5-00
వెల : రూ. 5 సం॥ చందా రూ. 50
ప్రత్యేక సం॥ చందా రు. 100

ఈ సంచికలో...

సంపాదకీయం 3

హంతకుడు (నాటిక) — చలం

కొండలు కదుల్తున్నాయ్ (కథ) — కొప్పల భానుమూర్తి 9

దళారీ సంస్కృతి-దాని రూపాలు — దివికుమార్ 17

బాల్యం చితికినప్పుడు (కవిత) — పప్పుల రాజిరెడ్డి 31

పిల్లల ప్రపంచం : (నిర్వహణ) పి. చంద్రశేఖర్ అజాద్ 33

గురు దక్షిణ (గల్పిక) — కొల్లి సత్యనారాయణ 36

రాకపోకలు (గల్పిక) — బజరా 39

దూరపు కొండల్లో (కవిత) — సంపత్ 40

బాధ (కవిత) — అగ్నిప్రియ 40

సిక్కోస్మిక అశ్లీల నృత్య ప్రదర్శన (స్పందన)
— వెంకట్రావు 41

అభిముఖ్యం "శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం"
— ఛాయరాజ్ 46

Edited, Printed and Published by K. RAVI BABU on behalf of JANA SAHITI (A.P.). at Chaitanya Printers, Vijayawada-2. for Co-operative Press, Vijayawada.
Working Editor : NIRMALANANDA

నిర్ 'లజ్జా' కరమైన ఫత్వా!

బంగ్లాదేశ్‌లో లౌకిక వాదానికీ మత ఛాందసత్వానికీ మధ్య తీవ్రమైన సంఘర్షణ జరుగుతోంది. తస్లీమా నస్రీన్ అనే స్త్రీ వాద రచయిత్రి ప్రస్తుతానికి ఆ సంఘర్షణకు కేంద్ర బిందువయింది. ఆవిడ ఇటీవల కలకత్తాలోని స్టేట్స్‌మన్ పత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో ముస్లిమ్‌లు పవిత్ర గ్రంథంగా భావించే 'ఖురాను'లో మార్పులు చెయ్యాలని కోరినట్టు ప్రచురింపబడిన దానికి ప్రతీకారంగా ఇస్లాం మత ఛాందసవాదులు తస్లీమాకు మరణ శిక్షను విధిస్తూ ఫత్వాను జారీ చేశారు. ఆమెను చంపిన వారికి లక్షల రూపాయల బహుమతిని ఛాందసవాద సంస్థలు ప్రకటిస్తున్నాయి.

తన ఇంటర్వ్యూని పత్రికల వారు వక్రీకరించారే తప్ప తాను 'ఖురాను'లో మార్పు చెయ్యాలని ప్రకటించలేదని తస్లీమా ఎంత మొత్తుకున్నా మత ఛాందసులు వినిపించుకోకుండా ఆమెను చంపివేయాలని శిక్ష ప్రకటనలూ, బందులూ, దాడులూ లాంటి కార్యక్రమాల్ని చేపట్టారు.

1972 డిసెంబరు 6న బాబ్రీ మసీదు కూల్చివేత ఫలితంగా బంగ్లాదేశ్‌లోని హిందూ మైనారిటీలు ఇస్లాం మతోన్మాదానికి బలయిన తీరుని వర్ణిస్తూ "లజ్జ" అనే నవలను రాసింది.

నిజానికి భారతదేశంలో ముస్లిం మైనారిటీలపై హిందూ మతోన్మాదులు సాగిస్తున్న భౌతిక, సాంస్కృతిక దాడులకూ బంగ్లాదేశ్‌లో ముస్లిం మత ఛాందసులు హిందూ మైనారిటీలపై చేస్తున్న దాడులకూ తేడా ఏమీ లేదు. రెండు చోట్లా మతోన్మాదులు ప్రతిఘటనను ఎదుర్కొంటున్నారు.

బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో జరిగిన యుద్ధంలో ముస్లిం ఛాం వాదులు పాకిస్తాన్‌కు అనుకూలంగా అల్ బదార్, అల్‌షామ్స్, రజాకార్లనే పేర్ల సాయుధ ముఠాలుగా ఏర్పడి వేలాది ప్రజలను, అనేకమంది రచయితలు, మేధలను హత్య గావించటంలోనూ, మహిళలను అవమానపరచటంలోనూ సాధనాలుగా వినియోగపడ్డారు. బంగ్లాదేశ్ ఏర్పడ్డ తర్వాత వారిలో చాలామంది పాకిస్తాన్ పారిపోయారు. అనంతర పరిణామాల్లో మళ్ళీ బంగ్లాదేశ్ తిరిగివచ్చారు. ప్రస్తుత 'జమాయిత్-ఇస్లాం' అధినేత (అమీర్) గులం అజం అటువంటివారిలో ఒకడు. ప్రస్తుతం తస్లీమాను హత్య చేయమని 'ఫత్వా' జారీచేసిన వారిలో ఆయన

ముఖ్యుడు. ఖలీదా జియా సైనాటిటీ ప్రభుత్వానికి 'జమాల్-ఎ-ఇస్లామీ'లు మద్దతు దార్లుగా వున్నారు.

1991లో జరిగిన ఎన్నికలలో జమాత్ నాయకుడు గులం అజం 1971 లో జరపిన హత్యాకాండ అత్యాచారాలు వివాదాంశంగా ముందుకొచ్చి - 1971 నాటి హంతకులపై విచారణలు జరిపి చర్యలు తీసుకోవాలనే ఉద్యమానికి ఊపునిచ్చాయి. 1992 మార్చిలో గులం అజంకు మరణశిక్ష విధించాలనే నినాదంతో ఢాకాలో పెద్ద ప్రదర్శన జరిపి 'ప్రజా కోర్టు' నిర్వహించారు.

భారతదేశంలోని హిందూ మతోన్మాదాన్ని సాకుగా చూపి బంగ్లాదేశ్‌లో ముస్లిం ఛాందసవాదం పేట్రేగుతోంది. ఈ క్రమంలో ఛాందస వాదానికి వ్యతిరేక పోరాటంలో స్త్రీల సమాన హక్కులను, లౌకిక వాదాన్ని బలపరచే తస్లీమా నస్రీన్ బంగ్లాదేశ్ సంఘటనలకూ, సంఘర్షణకూ కేంద్ర బిందువయింది.

ప్రపంచవ్యాపితంగా దోపిడీ పాలక వర్గాలు తమ చేతిలో వున్న సాధారణ వర్గ పీడన అంగాలూ, సాధనాలతో పాటు మత ఛాందసవాదం (ఫండమెంటలిజం) పునరుద్ధరణవాదం, ఫాసిజం, రేసిజం (జాతి వివక్షతా సిద్ధాంతం—భారతదేశంలో కుల తత్వం) తమ వర్గ ప్రయోజనాలు నెరవేర్చే సిద్ధాంతాలుగా వుపయోగిస్తున్నారు. అన్ని మతాల మతతత్వం, మత ఛాందసవాదం అభివృద్ధి నిరోధకమైనవే. అయితే మెజారిటీ మతానికి చెందిన మతతత్వం మరింత విపత్కర పరిణామాలకు దారి తీస్తుంది.

భారతదేశంలో హిందూ మతతత్వం, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ముస్లిం మత ఛాందసవాదం ఎక్కువ ప్రమాదకరమైననిగా ఉన్నాయి.

సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తూ, స్థానిక భూస్వామ్య, (కుల, మత) దురహంకార శక్తులకు వత్తాసునిస్తూ దోపిడీ పీడనల వ్యవస్థకు ఊపిరి పొయ్యటం మత ఛాందసత్వం యొక్క పని విధానంగా వుంది గాట్ ఒప్పందాల నేపథ్యంలో, పునర్వలసీకరణ జరుగుతున్న క్రమంలో వెనుకబడిన దేశాలను (మనవరకు భారత ఉపఖండ ప్రజలను, జాతులను) సామ్రాజ్యవాదం కొల్లగొట్టుకు పోవటాన్ని అర్థం చేసుకోనివ్వకుండా చేయటానికి పక్కదారి పట్టించడానికి మతతత్వం పరోక్షంగా తోడ్పడుతోంది.

మొత్తంగా ఉపఖండం-భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలోని లౌకిక, ప్రజా స్వామ్య వాదులు, రచయితలు, మేధావులు పేట్రేగుతున్న మత ఛాందసత్వానికి వ్యతిరేకంగా, తక్షణంగా తస్లీమా నస్రీన్‌పై విధించిన ఆంక్షలు, ఫత్వాలకు వ్యతి రేకంగా ఉద్యమించవలసి వున్నది.

నాటిక :

హంతకుడు

— చలం

[ఈ నాటికను చలం 40వ దశకంలో రాశారు. అభ్యుదయ రచయితలు, కార్మిక వర్గం, మార్క్సిజం, వ్యక్తి స్వేచ్ఛ- సామాజిక స్వేచ్ఛలు, నీతి-అవినీతులు సౌందర్యం యొక్క వర్గ స్వభావం మొదలైన అంశాల్ని ఈ నాటికలో ఆయన తనదైన పద్ధతిలో (తర్కము-ఎగతాళి) ప్రస్తావించారు.

హంతకుడు వీరయ్య తన చెల్లెలు మానాన్ని పెట్టుబడిదారుడు శోభనాచలపతి దోచుకున్నాడన్న ఆక్రోశంతో చంపటానికి (వ్యక్తిగతంగా కక్ష తీర్చుకోవటానికి) వచ్చినట్లు ఈ నాటికలో చూస్తాం. వీరయ్య కమ్యూనిస్టు కాదని రచయితే చెప్పిస్తాడు. కానీ అతన్ని కార్మిక వర్గ భావజాల ప్రతినిధిగా నిలబెట్టి, వాటిని వక్రీకరించి ఎగతాళి చేస్తాడు రచయిత! కార్మికులు మొరటుగానూ, అపరిశుభ్రంగానూ ఉంటారని పెట్టుబడిదారీ సంస్కారం సౌమ్యంగా, విశాలతత్వంతో, సౌందర్య పిపాసతో ఉంటాయనే అభిప్రాయాన్ని చలం వ్యక్తం చేశారు.

"మా డబ్బు వంచుకోవటం ధర్మమా?!.... మీ ఆడపిల్లను వంచుకోవడం అధర్మమూనా? వెయ్యి మంది బీదలు పదిమంది ధనికుల మీద పడటం ధర్మ యుద్ధమేనా?" అని చలం ప్రతినిధిగా ఉన్న పాత్ర (పెట్టుబడిదారుని బిడ్డ) కమల కార్మికుణ్ణి ప్రశ్నిస్తుంది. "సౌందర్యం అంటేనే (నాటిక ప్రకారం బాహ్య సౌందర్యమే) బూర్జువా (సౌందర్యం)" అని చలం చెప్పిస్తారు. శ్రామికుల కష్ట ఫలితమైన హృదయం లేని డబ్బునీ: ధనికుల కేమాత్రమూ సంబంధంలేని శ్రామికుల స్త్రీలకూ పంచుకోవటాన్నీ ఒకే రకమైనవిగా చలం తేలుస్తారు.

పై వాటితో పాటు మార్పు యొక్క అనివార్యతను 'అంతిమ విజయం ప్రజలదే'నన్న ప్రగాఢ విశ్వాసాన్ని కూడా ఆయన ప్రకటిస్తారు. చలం సృష్టించిన వైవిధ్య పూరితమైన అపార సాహిత్యంలో కొద్ది పేజీల ఈ నాటిక ద్వారా ఆయన తాత్విక, రాజకీయ, సామాజిక చింతనను సూక్ష్మ (Micro) రూపంలో దర్శించగలం. అందుకే "ప్రజాసాహితి" పాఠకుల కోసం దీన్ని పునర్ముద్రిస్తున్నాం.

— సం॥]

సమయం : అర్ధరాత్రి

[చాలా ధనవంతుల మేడ. హాలులో చిన్న ఎలక్ట్రిక్ దీపం కిటికీని చప్పుడు కాకుండా తెరుచుకుని ఒక అతను హాలులోకి జారాడు. అతనికి ఇల్లు కొత్త. ఎటు వెళ్ళాలా అని చుట్టూ చూస్తున్నాడు.

వెనక గుమ్మంలోంచి ఓ కుర్రాడు (12 ఏళ్ళు) చప్పుడు కాకుండా వొచ్చి నుంచుని అతన్ని గమనిస్తున్నాడు. వొచ్చిన అతని వీపు కుర్రాడివేపు.]

కుర్రాడు : ఏం లాభం లేదు.

(గుండు దెబ్బ తిన్నట్టు వొచ్చిన అతను తిరిగాడు.)

నగలూ, డబ్బూ అన్నీ బాంకిలో పెట్టేశారు—

(తెల్లబోయి చూస్తున్నాడు ఆ వొచ్చిన అతను. కిటికీలోంచి దూకలేదు.)

తొందరపడకు ఎవరినీ లేపనులే. నెమ్మదిగా వెళ్ళిపోదువు గాని. నువ్వు దొంగవా?

అతను : కాను.

కుర్రాడు : నా పేరు రాజారావు. నువ్వెవరో నీ పేరేమిటో చెప్పావు కావు.

అతను : నేను వెళ్ళిపోతాను.

రాజారావు ; ఎందుకు తొందర? నాకు నిద్ర రావడంలేదు.

అతను : కాదు. నేను....

(వెనక నుంచి ఇరవై ఏళ్ళ అమ్మాయి వొచ్చి లైటు వేసింది.)

అమ్మాయి : ఏమిటి రాజూ! ఎవరితో మాటాడుతున్నావు?

రాజారావు : ఎవరో అక్కా! తీరా వొచ్చి వెళ్ళిపోతానంటాడు. (అతనితో) ఈమె మా అక్క కమల.

కమల : వెళ్ళిపోవడమేమిటి? కూచోండి. మీరు దొంగేనా?— ఆ కిటికీ లోంచి వొచ్చారా?

రాజారావు : అట్లానే వుంది. దొంగకాడట.

కమల : కాదా? అవుననుకుని సర్దా పడ్డాను. మరి ఎవరు? మీ పేరేమిటి?

అతను : నన్ను పోలీసులకి పట్టిస్తారా? చంపేస్తా— (కత్తి చూపుతున్నాడు)

రాజారావు : ఎందుకు పట్టిస్తాము? కాని మీరు కాస్త పెందరాళే రావలసింది. నాన్న కూడా వుండేవారు.

అతను : ఇప్పుడు లేరా?

కమల : లాడ్జిలో విందుకి వెళ్ళారు. వొస్తారు కూచోండి. దొంగ కాకపోతే ఎవరు మీరు?

రాజారావు : దొంగతనం యింకా చెయ్యందే, దొంగ యెట్లా అవుతాడు?

కమల : అంటే దొంగాంకురుడు. కాక అంకుర దొంగా?

రాజారావు : ఆ సమాసం వొప్పుకోరే. చోరాంకురుడు అనాలిట.

కమల : ఈయన్ని మన ఫ్యాక్టరీలో చూచానురా. కాదా?

అతను : అవును.

కమల : ఐతే తెలీదా నీకు- నాన్న డబ్బూ, బంగారం ఏమీ ఇంటో వుంచ లని! నీ పేరు వీరయ్య. అవునా?

వీరయ్య : ఉఁ.

కమల : నువ్వు కమ్యూనిస్టువా?

వీరయ్య : కాదు.

కమల : కాని లాభాలు సమానంగా పంచమంటారు కదూ. వర్కర్ల కార్య దర్శివి. కావా?

రాజారావు : లాభాలు నాన్న పంచటం లేదని, తనే తీసుకుందామని వొచ్చాడే అక్కా. అవునా?

వీరయ్య : కాదు.

రాజారావు : మరి ఎందుకు?

వీరయ్య : మీకెందుకు?

కమల : మాకు కాదా. మా అతిథి ఎందుకు వచ్చాడో తెలుసుకోవడం? అందులో వేళగానివేళ. తోవగాని తోవలోంచి ఊడిపడితిరి కదా? 'ఏం పనిమీద?' అనికూడా అడగకూడదా?

రాజారావు : ఆకలి గావునే, అదీ ఆ కోపమంతా.

కమల : చూశావా? మరిచే పోయినాను. (వీరయ్యతో) భోజనాలై పోయినాయి పలహారం తెప్పిస్తాను.

వీరయ్య : నాకు ఆకలిగా లేదు.

రాజారావు : అదేమిటి ఆకలిగా లేకపోవడం? అర్ధరాత్రి ఆకలిగా లేకపోతే వర్కరెట్లా అవుతావు? అభ్యుదయ రచయితలు ఒప్పుకోరు, నాకేం? మొహమాట పడుతున్నాడే, బాలూని కేకెయ్యి.

వీరయ్య : ఎవరినీ కేకెయ్య వద్దు, నోరెత్తితే చంపుతాను. నన్ను పోని య్యండి.

కమల : పాడైన నిద్ర ఎట్లానూ పాడయింది. ఎందుకు వెళ్ళడం పైగా!

వీరయ్య : ఆ బాలూ చేత పోలీసుల్ని పిలిపించడానికా?

కమల : ఎబ్బే! పోలీసుల్ని పిలిచే తెలివే వుంటే మావంటలో ఎందుకు వుంటాడు. బాలూ? వర్కర్లలో చేరేవాడు. నీ మీద నాకు ఇష్టం. నిన్నెందుకు పట్టి స్తాను? బాలూ, బాలూ.

బాలూ : (కింద నించి) అమ్మా!

రాజారావు : వీరయ్యగారు వొచ్చారు. పలహారం తీసుకురా. ఇంతకీ మీరు వొచ్చిన పని—

వీరయ్య : (తీవ్రంగా) మీ నాన్నని చంపడానికి.

కమల : నీకూ కోపమే నన్నమాట నాన్నని చూస్తే. నాకూ చంపాలనీ పిస్తుంది నాన్నని.

రాజారావు : అయితే ఇతను హంతకాంక్షుపడే. లేక హంతకోద్దేశుడు.

కమల : ఆ కత్తితోనే చంపుతావా?

రాజారావు : మానాన్న కోటుకోంచి దిగుతుందా కత్తి? కోటు చాలా మందం

కమల : ఎక్కడ పొడుస్తావు? గుండెల్లోనా? వీపులోనా?

రాజారావు : తరువాత నీ కత్తి నువ్వు తీసుకుపోతావా? వొదిలేస్తావా?

కమల : మరి నీకు అభ్యాసం వుందా? ఇదే కొత్తా?

రాజారావు : (ఆలోచనగా) ఇంటో వీలుండ దనుకుంటాను. పడుకునేప్పుడు గది తలుపు గడియ వేసుకుంటాడు. ఫాక్టరీలోనే కానీ కూడదూ?

(బాలూ ఫలహారాలు తెచ్చి వీరయ్య ముందు పెట్టాడు. బాలూ మంచి వస్తాదు. వీరయ్య భయపడుతున్నాడు.)

వీరయ్య : నాకేం వొద్దు. నన్ను వెళ్ళనీండి.

రాజారావు : బాలూ వొప్పుకోడు. అతను చేసిన ఫలహారాలికి అవమానం సహించడు.

(వీరయ్య తింటున్నాడు.)

వీరయ్య : ఎప్పుడూ ఇంత మంచివి హాయిగా తింటారా? మా పొట్టలు మాడుస్తో! అందుకే కదూ....

రాజారావు : ఆకలి లేదన్నావు కదూ! మీ పొట్టలు ఏం మాడాయి?

వీరయ్య : మేము ఇల్లాంటివి తింటామా?

కమల : లాభాలు పంచుకుంటే మాత్రం, ఇట్లాంటి ఫలహారాలు చేసుకో గలరా మీరు? ఆ లాభాలన్నీ ఒకరి దగ్గర వున్నాయి గనకనే వీలవుతోంది. లాభాలు పంచితే మంచి ఫలహారాలు ఎవరికీ వుండవు. వీటి ఖరీదు ఎంతో తెలుసా?

వీరయ్య : పోనీలే. ఎవరికీ వీల్లేదు. ఫలహారాలు లేకపోతే నేం? పోనీ, ఎప్పుడన్నా చేసుకుంటాం.

కమల : అసలు మీకు ఇట్లాంటివి వున్నాయని తెలిస్తేగా మీరు చేసుకోడానికి. మేమూ మీ వల్లనే ఐతే మీకు చెప్పేదెవరు? నాన్నను చంపితే మీకు అసలు లాభాలే వుండవుగా?

వీరయ్య : అందుకే కాదు చంపేది.

బాలూ : ఏమిటి? అయ్యగారిని చంపుతాడా వీడు?

(తరువాయి 52వ పేజీలో)

కొండలు కదుల్తున్నాయ్

— కొప్పుల భానుమూర్తి

పన్నెండయ్యింది. సూర్యుడు కొత్త రూపాయి బిళ్ళలాగ తళ తళ మెరుస్తున్నాడు. సూర్యుడి వేడి కిరణాలు ఎలుగుల మెట్టను నిప్పు రాళ్ళలాగా మాడ్చేస్తుంటే వందలాది మంది కూలి జనంతో- లారీలు, క్రేన్లు చేస్తున్న పనివల్ల దుమ్ము, ధూళి గాలిలోకి రేగి- కొండ కొండతా పొగలు కక్కుతున్నట్టుంది. కొండ చివర్న, గునపాం పట్టి ఒక పెద్దరాయిని జరిపే ప్రయత్నంలో వున్న కొండడి అరికాళ్ళు రాళ్ళ వేడికి కమిలిపోతున్నాయి. అయినా, పనికి అలవాటు పడిన శరీరం వీటిని లెక్కచెయ్యడం లేదు. శరీరం పై నుండి జారి పడుతున్న చెమట రాయికి జానెడు దూరంలోనే ఆవిరై గాలిలో కలిసిపోతుంది. కొండడు తన శక్తిని కేంద్రీకరించి రాయిని పక్కకు నెడుతున్నాడు. మనిషి శక్తికి తలొంచిన రాయి ఎదురు ప్రయత్నాన్ని విరమించుకొని పక్కకు జారి పడింది. కొండడు విజయ గర్వంతో ఒక్కసారి తనను తానే అభినందించుకొన్నాడు. చేతిలోని గునపాం మెల్లగా భుజంమీద పెట్టి తలకున్న పాగాతో వంటిన వున్న చెమటను తుడుచుకొని మారో మారు తను సాధించిన పనిని తృప్తిగా చూసుకొన్నాడు.

ఎలుగుల మెట్ట శిఖరం నుండి చూస్తే అక్కడ పని చేసుకొంటున్న కూలీలు కొండడికి ఉడుతల దండులానో, చీమల బారుల్లానో కనిపించారు. ఆ పక్కనే వున్న పెద్ద పెద్ద క్రేనులు, లారీలు, టిప్పర్లు భూతాల్లా అగుపించాయి. అక్కడికి అర కిలో మీటరు దూరంలో వున్న రాయిపల్లి గ్రామాన్ని చూసాడు. కొండల నడుమ వున్న ఊర్లో అన్నీ పూరిళ్ళు- కళ్ళంలో పేర్చిన గడ్డి కుప్పల్లాగ, వాటి మధ్య రెండు మూడు డాబా ఇళ్ళు, నాలుగైదు పెంకుటిల్లు ఎండలో ధగ ధగా మెరుస్తున్నాయి. ఊరికి మధ్య వున్న తన ఇంటిని, గడపలో కుక్కి మంచం మీద కునుకు తీస్తున్న తన నాయినమ్మను తృప్తిగా చూసుకున్నాడు. కొండడికి నాయినమ్మంటే గొప్ప అభిమానం. చిన్నప్పుడే తన అమ్మ, అయ్య చనిపోతే తననిఇంతవాడ్ని చేసింది కదా!

వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి ఎండకు జడిసి ఎవ్వరూ బయట తిరగడం లేదు అందులోకి టైము పన్నెండున్నర అవుతోంది. మరి కొద్ది సేపట్లో కొండలు

పెడుతాయి. ఉదయం నుండి కొండలకు డొల్లలు వేసిన తర్వాత- పన్నెండున్నర నుండి ఒంటి గంట వరకు రాళ్ళను డైనమేట్లతో పేల్చుతారు. పేలుళ్ళ శబ్దం మొదలైందంటే పన్నెండున్నర అయిందని ఆ చుట్టు ప్రక్కల గ్రామస్తులకు అనిక. వారికి వేరే గడియారాలు అవసరం లేదు. ఈ చుట్టు ప్రక్కల వున్న కొండలన్నీ ఇంతకాలం వృథాగా పడి వున్నాయి. ఇన్నాళ్ళకు వీటి అవసరం గుర్తించిన వాళ్ళు ఇప్పుడు ఈ కొండల మీద దాడి చేసారు. సుమారు ఏడెనిమిది గ్రానైట్ కంపెనీల పాలిట ఈ కొండలు బంగారు కొండలు. వీరు ప్రభుత్వం నుండి ఈ కొండల్ని లీజుకు తీసుకొని రాళ్ళను తవ్వడం మొదలు పెట్టారు. ఒక్క రాయిని ఓడెక్కించి విదేశాలకు పంపిస్తే కాంట్రాక్టరుకి లక్ష రూపాయలు పుట్టినట్టే. అందుకే ఇక్కడున్న జనాలకు కూలిచ్చి రాళ్ళను వెలికి తీయిస్తున్నారు. రెండేళ్ళ క్రితం వరకు శ్రీకాకుళం జిల్లా గ్రామీణులు పనుల్లేక గోదావరి, కృష్ణా జిల్లాలకు వలస పోయేవారు. ఇప్పుడు వారికి ఆ అవసరం లేదు. చడ్డీ కట్టడం చాతకాని గుంటడి దగ్గర నుండి అరవై యేళ్ళ ముసిలాడి వరకు- అందరికి ఈ కొండలు కూలిస్తున్నాయ్. ఇంతకాలం పనీ పాటు లేక అష్టా చెమ్మ ఆడుకొనేవారు, ఊరి చివర్ల చింతల్లో పేక ముక్కలు తిరగేసే పోకిరి రాయుళ్ళు- అందరు ఇపుడు కొండకెళ్లి నాలుగు రాళ్ళు సంపాదించినోళ్ళే. ఖాళీగా ఎవర్తైనా కనిపిస్తే చాలు జేబులో ఇరవై రూపాయలు కుక్కి, చేతికి తట్ట, పార ఇస్తున్నారు. ఆడ మగ తేడా లేదు. ఆడ కూలికి పదిహేను. మగ కూలికి ఇరవై. ఎవరెంత పనిచేస్తే అంతే! పిండి కొలదీ రొట్టె. అందులోకి కొండ దగ్గర వృథాగా పోయేది ఏమి లేదు. ఆఖరికి చిన్న చిన్న రాళ్ళు, మన్ను- అంతా సొమ్మే. రాయి, రప్పా స్టోను క్రషర్‌కి, మన్ను- ఈ మధ్యనే టౌనుకు దగ్గరలో వెలిసిన రియలెస్టేట్ జాగాలో మధ్యనున్న చెరువును పూడ్చడానికి కాంట్రాక్టు కుదిరింది. పెద్ద పెద్ద రాళ్ళను లోడింగ్ చెయ్యడానికి క్రేన్లున్నాయి. ఈ చిల్లర పనులు చెయ్యడానికే ఈ కూలీలు.

రోజువారి కూలికైతే ఇబ్బంది లేదు గాని ఈ పేలుళ్ళ వల్ల మాత్రం జనం భయంతో చస్తున్నారు. ఏ మూల నుండి ఏ రాయి వచ్చి పడ్తుందో నన్న భయం వార్ని పీడించ సాగింది. అప్పటికి చిన్న చిన్న రాళ్ళు ఎగిరొచ్చి ఇళ్ళమీద పడి కప్పులకు కన్నాలు చేసి ఇంట్లో ఎండలు నింపిన సందర్భాలు అనేకం. బయట కట్టి వున్న పశువుల మీద పడటం- వాటికి దెబ్బలు తగలడం- అనేక సార్లు జరిగింది. అయినా ఎవరూ ఏమీ చెయ్యలేరు. ఈ కాంట్రాక్టర్లకు వున్న పలుకుబడి- రాజకీయ నాయకుల అండదండలు వారికి రక్షణ కల్పిస్తున్నాయి.

అప్పటికి రాయిపల్లి గ్రామస్తులంతా ఒక్కటై అవూరి ప్రెసిడెంట్ చౌదర్నాయుడికి ఈ విషయం చెపితే, అతడు నింపాదిగా "అవున్నిజమేనర్రా! కాని

మనమేటి సెయ్యగలం. ఎల్లి గట్టిగా నిలేద్దువంటే ఆ కాంట్రాక్టర్లు ఎక్కడో హైద్రబాదు లోనో, మద్రాసు లోనో వుంటారు. పోని ఇక్కడి కొచ్చినప్పుడు అడుగుదుమా అంటే ఇలగొచ్చి అలగెలి పోయి, శ్రీకాకుళంలోన ఏ తోటల్లోనో కూకుంతారు. మనమేటి సెయ్యగలం? అయినా ఇన్నాల్లు పనుల్లేక మనోల్లందరు కూలి కోసం పడమట కెల్లిపోయిందాని కంటే ఇది నయం కదా! పొయ్యికాడ అకుమల్లాగ ఇక్కడే మనకు కుదిరింది కదా! అవ్వా కావాలి, బువ్వా కావాలంటె ఎలగ? బువ్వకావాలంటే ఈ పాటి కష్టాలు బరాయించాలి. తప్పదు" అని తేల్చి చెప్పేశాడు. జనమంతా 'అవున్నిజమే అంటే,' 'అది కరక్టే' అని వూరికుండి పోయారు. ఆ ప్రక్కనే వున్న అతని తమ్ముడు అప్పల్నాయుడు కలగజేసు కొని "మనకన్నీ సమస్య లేర్రా. అపాటి కష్టాలకి ఓర్చుకోకపోతే కూలెలగొత్తాది, కూడెవడిత్తాడు- సంవత్సరం పొడుగునా పనంటే మాటలేటి". అని తాపీగా చుట్ట ముట్టించుకున్నాడు. కొండకి ఆనుకొని వున్న అతడి పదెకరాల బంజరు భూమిని గ్రానైట్ కంపెనీ వారు పది లక్షలిచ్చి కొనేసి- అందులోనే వర్కింగ్ సైట్‌గా పన్లు చేసుకుంటున్నారు. అతడికి కొంచం దూరంలో వున్న అదినారాయణ కూడా అదే మాట అన్నాడు. అతడి కున్న నాలుగు చిన్న గదుల్ని గ్రానైట్ కంపెనీ వారికే ఒక్కొక్కటి మూడొందలు చొప్పున అద్దె కిచ్చి నెలకు పన్నెండొందలు సంపాదిస్తున్నాడు.

'కూలి కోసం కోసుళ్ళ కొద్దీ వెళ్ళాల్సిన బాధ తప్పింది కదా' అని వీరంతా సరిపెట్టుకుంటున్నారు. నిన్న మొన్నటి దాక కొండడు కూడా ఆవారాగా తిరిగే వాడే. వాడి నాయనమ్మ రెక్కలు ముక్కలు చేసుకొని సుఖపెట్టింది. పదహారు సంవత్సరాల వయసు వచ్చే దాక వాడికి కష్టం అంటే ఏమిటో తెలీదు. నీడనున్న ప్రాణం నీడనే కోరుకున్నట్టు కొండడు కూడా పనంటే వెనకడుగు వేయసాగాడు. తన మనమడు అలా చెడి పోవడం గమనించి ఒకరోజు వాడ్ని పిల్చి "ఒరే నాయినా! కొండా- వయసు నోడి వయ్యావు. ఇంకెంత కాలం ఇలగ కూకొని తింతావు. నాకా ఒంట్లో సత్తువ అయిపోయింది. నా కోసం కాకపోయినా నీ బతుకైనా కానకపోతెఎలాగరా? ఊరికే తిన్తాంగుంటే నీకు- ఆ ఎదురు కొండకి తేడా ఏటి? అది కూడా పాతికెకరాలు ఆక్రమించేసి ఊరికి దిష్టి బొమ్మలాగుంది దాన్లాగే నువ్వు కూడా వుంటె ఎలగరా సెప్మీ". అని అంటే- కొండడు తన నాయినమ్మతో, "ఓల్నాయినమ్మ! సూత్తుండే- ఒక రోజుకి నేను పెద్దోడ్నై డబ్బులు సంపాదిస్తానే- ఏలు ఏలు కూడ బెట్టి నీ సేతుల్లో పోత్తాను. నువ్వలగే అంటుండు. నవ్వినూర్లే పట్టణాలౌతాయి. ఈ కొండే కరిగి బంగారమౌతాది" అని అనేవాడు.

వాడన్నమాటే నిజమైంది. నల్లగా రాత్రుళ్ళు భూతంలా భయపెట్టే కొండ ఇప్పుడు బంగారు గని. ఇంత కాలం ఈ గుట్టల్లోన ఎలుగుబంట్లు, నక్కలు,

తోడేళ్ళు తిరుగుతుండేవి. ఇప్పుడు కాంట్రాక్టర్లు, పెద్ద పెద్ద షాహుకార్లు తిరుగుతున్నారు. ఈరోజు ఈ రాళ్ళే కోట్లాది రూపాయల విలువ. ఇంత కాలం రాయిపల్లి గ్రామస్తులు ఈ మెట్టల్ని కేవలం పిడకలు అద్దడానికే వుపయోగించుకున్నారు కాని, వీటివల్ల ఇంత వుపయోగం వుంటుందని వారేనాడు వూహించలేదు. ఇపుడు ఈ రాళ్ళన్నీ గ్రానైట్ నిక్షేపాలు. వందలాది మంది దృష్టి ఈ రాళ్ళ మీదే.

ప్రకృతిలోని ఏ వుపయోగపు విలువైన కష్టజీవులకు చెందడం లేదు. శ్రామికులు బావిమీద గిలకల్లాంటి వారు. నీరు అందినట్టే అంది దూరం అవుతుంది గాని, గిలక ఏనాడు నీటికి చేరువ కాలేదు

కొండ దగ్గిర కూలీలందరు తమ కేరేజీలు, చద్ది అన్నం మూటలు తీసుకొని దూరంగా వున్న చెరువు గట్టు వైపు వెళుతున్నారు. అంతవరకు కూలి జనంతో కిలకిల్లాడిన కొండ ఇపుడు దాదాపు నిర్మానుష్యమైంది. మరి కొద్ది సేపట్లో కొండ పేలబోతుంది. అందుకే జనాల్ని అందర్ని దూరంగా పంపేశారు సూపర్‌వైజర్లు. బ్లాస్టింగ్ యూనిట్‌కి సంబంధించిన వారు నలుగు రైదుగురు మాత్రం ఆ ప్రాంతంలో తిరుగుతున్నారు. రాళ్ళకు వేసిన డొల్లల్లో మందులు పెట్టి వాటికి వైర్ కనెక్షన్ ఇవ్వడం పూర్తైంది. టైము పన్నెండున్నర అయింది. అక్కడకు కొంచం దూరంలో వున్న బ్లాస్టింగ్ పాయింట్ దగ్గిరకు అందరూ చేరుకొని బాంబింగ్ చెయ్యడానికి సిద్ధంగా వున్నారు.

కొండ దగ్గిర జరుగుతున్న తతంగమంతా చెరువు గట్టు దగ్గిర నుండి కొందరు తిలకిస్తున్నారు. కొందరైతే 'ఇది మాకు కొత్త కాదు' అన్నట్టు తమ కేరేజీలు విప్పుకొని భోజనాలకు ఉపక్రమించారు. ఆ రోజే పనిలోనికి వచ్చిన అప్పారావు మాత్రం కనీసం కాళ్ళు చేతులైనా కడుక్కోకుండా కొండ దగ్గిర జరుగుతున్న దాన్ని ఉత్సాహంగా చూస్తున్నాడు. కొండ ఎలా పేలుతుందో, రాళ్ళు ఎంత ఎత్తు ఎగుర్తాయోనని వాడికి కుతూహలంగా వుంది. సూపర్‌వైజర్లు, బ్లాస్టింగ్ యూనిట్- అంతా బ్లాస్టింగ్ పాయింట్ దగ్గిరే వున్నారు. సైట్ ఇన్‌చార్జ్ బాంబింగ్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇదంతా ఆసక్తిగా చూస్తున్న అప్పారావు కళ్ళు ఒక్కసారి కొండ మధ్యన నిలిచిపోయాయి. వాడి ఒళ్ళు జలదరించింది. వెంటనే తన పైమీది తువ్వాలు తీసి గాలిలో వూపుతూ, పెద్ద పెద్ద అంగలేసుకుంటు పరిగెత్తి "బాబో! సూపర్‌వైజర్.... బాబో.... ఆపండి బాబు.... పేల్చొద్దు.... కాసేపు ఆ.... ప....ండి....బాబో...." వాడి మాటలు సగంలోనే ఆగిపోయాయి. బాంబులు పేలడం మొదలైంది. ఆ శబ్దంలో అప్పారావు వేసిన కేక కలిసిపోయింది. ఒకదాని తర్వాత మరొకటి. దీపావళి రాత్రినాటి బాంబుల్లా.... రాళ్ళు అంత ఎత్తున ఎగిరి 'ఢట్' మని నేల మీద పడుతున్నాయి. కొన్ని రాళ్ళు దూరంగా వున్న చెరువులో పడి నీళ్ళను గట్టు

మీదకు చిమ్ముతున్నాయి. మరి కొన్ని రాళ్ళు ఊరివైపు ప్రయాణం చేస్తున్నాయి. ఆ శబ్దాలకు అదిరిపడి పశువులు 'అంబా' అని కట్లు తెంచుకొని పారిపోతున్నాయి. కొండ పేలుతున్న శబ్దంలో 'అమ్మా' అనే ఒక గావుకేక- అక్కడున్న అందరి దృష్టిని ఆకర్షించి కొండవైపు తిప్పుకొంది. ఆ కేక పగిలిపోతున్న కొండ బాధతో వేసినట్లుంది. ఎవ్వరికి ఏమీ కనిపించట్లేదు- ఎగిరిపడే రాళ్ళు, పొగలు తప్ప. అరగంట తర్వాత, బాంబుల హోరు తగ్గిన తర్వాత జనం అంతా ఒక్కసారి కొండ మీదికి ఎగబ్రాకారు. కొండంతా చెల్లా చెదురగా పడ్డ రాళ్ళతో చిందర వందరగా వుంది. శత్రువులు కూల్చిన కోటలా దొంగలు పడ్డ ఇల్లులా- పోలీసులు రైడ్ చేసిన గ్రామంలా. అప్పారావు ఇందాక తాను చూసిన జాగాలో- పెద్ద రాయి కింద కేవలం కాళ్ళు, నడుం భాగాలు కనిపించగానే- జనాలవైపు తిరిగి "ఓరం దరు ఇట్రండి- ఇటు- ఇటు-" చప్పట్లు చరిచి పిలిచాడు. కొండను గాలిస్తున్న జనం అప్పారావు కేక విని ఇటే పరుగెత్తుకు రాసాగారు. వారంతా ఒక్కసారి కొండపైకి రావడం చూస్తుంటే ప్రవాహం కింది నుండి పైకి ప్రవహిస్తున్నట్లుంది. వాళ్ళ అడుగుల ధ్వనికి కొండ మరోసారి ప్రతిధ్వనిస్తుంది. అందరూ చేరి రాళ్ళ మధ్య నలిగిన శవాన్ని చూసారు. తల పగిలి గుర్తు పట్టడానికి కూడా వీలు లేని శవం. రక్తం తుళ్ళి చుట్టు వున్న రాళ్ళను ఎర్రగా మార్చింది. శవానికున్న నీలం బాడి రక్తంతో తడిచి నల్లగా మారింది. తలపగిలి మెదడు ముద్ద పక్కనున్న రాయికి మన్ను ముద్ద అంటుకున్నట్లు అంటుకుంది. కొండల్లో పుట్టిన సెలయేటి పాయలా రక్తం ఆ రాళ్ళ మధ్య నుండి కిందికి దిగుతుంది. ఆ దృశ్యాన్ని చూస్తున్న ప్రతి ఒక్కరి శరీరం ఆ రాళ్ళల్లాగే వేడెక్కి పోతుంది. ఆ ఘోరాన్ని చూస్తున్న ప్రతి ఒక్కరి గుండె ఆ రాళ్ళల్లాగే పగిలిపోతున్నవి. వారి కళ్ళు అన్ని కలుసుకుంటున్నాయి. కలుసు కుంటున్న కళ్ళు మాట్లాడు కుంటున్నాయి. ఆ మాటలు వర్తమానాన్ని అంచనా వేసి భవిష్యత్తును నిర్దేశించ మంటున్నాయి.

అప్పుడే అక్కడకు వచ్చిన సైట్ ఇన్‌చార్జ్, కాంట్రాక్టరుకు స్వయాన మేనల్లుడు అయిన సుందర రామరాజు శవాన్ని, కూలీల్ని చూసి భయపడ్డాడు. వారి చూపులకు అర్థాలు తెలుసుకొని ఏం చెయ్యాలో నిర్ణయించుకున్నాడు. కొండ దిగి తన ఆఫీసు వైపు పరుగు లాంటి నడకతో వెళ్ళిపోయాడు. అతని వెనకే సూపర్‌వైజర్లు కూడా వెళ్ళిపోయారు. సుందర రామరాజు వెళ్ళిన తర్వాత కూలీలలో వయసులోను, అనుభవం లోను పెద్దవాడైన అప్పలసూరి పక్కనే వున్న వాడ్ని పిల్చి "ఒరే సత్తిం.... నువ్వు అర్జెంటుగా సైకిలేసు కెళ్ళి, జలుమూరుకి అవతలున్న భీముడి మెట్టకాడ మన యూనియన్ లీడరు పెకాళం బావున్నాడు. అతగాడ్ని, అక్కడొంపే వున్న మనోల్నందర్ని

ఇక్కడకు బేగి పొమ్మను. ఇక్కడ జరిగిందంతా సెప్పు. నీ సైకిలు సెకాశం బాబుకిచ్చి ఆతగాడ్ని ముందు పంపించియ్యాల. ఎల్లు బేగెల్లు" అంటు పురమాయించాడు. వాడు ఆ మాట అందుకోవడమే తడవు నాలుగు అడుగుల్లో కొండ దిగి వూరి వైపు పరిగెత్తాడు- సైకిల్ కోసం. అక్కడే వున్న ఆడ కూలీల్లో "ఒలే. అదెమ్మా, నువ్వు, అల్లా సరస్వతి వూర్లోకెల్లి సూరమ్మను ఇక్కడకు తీసుక పొండి. ఇక్కడ జరిగిందాన్ని దాంతో సెప్పకండి సుమి. మంచి మాటలు సెప్పి, మాయజేసి ఇక్కడకు తీసుకొని పొండి." అంటు మరో ఇద్దర్ని ఎత్తాయించి వూర్లోకి పంపించాడు.

పద్ధతిగా సాయంత్రం ఆరు గంటల తర్వాత కొండని పేల్చే కార్యక్రమం మొదలు పెట్టాలి. పేల్చే ముందు నాలుగు వైపుల అనౌన్సుమెంట్ చెయ్యాలి. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్న ఈ కంపెనీలు ఇటువంటి నియమాలకు నీళ్ళొదిలేశాయి.

కూలీల గుండెలన్నీ మండిపోతున్నాయి. ఇరవై రూపాయల కోసం ప్రాణాల్ని అమ్ముకొనే తమ దయనీయమైన బ్రతుకుల మీద వారికి అసహ్యం వేసింది.

ఇక్కడ జరిగింది వూర్లో తెలిసినట్లుంది. జనం ఇటువైపు పరిగెత్తుకొని వస్తున్నారు. వాళ్ళంటడు అలా పరిగెత్తుకొని వస్తుంటే కొండలు కదుల్తున్నాయేమోనని అనుమానంగా వుంది. అందరూ కొండ పైకి ఎక్కి శవాన్ని చూసి నోళ్ళల్లో గుడ్డలు కుక్కుకొని లోలోపలే కుమిలిపోసాగారు. జనాలందర్ని తప్పించుకొని ముందు కొచ్చిన సూరమ్మ "అవునర్రా.... ఏమైందర్రా.... ఏమైందనడిగితే ఎవులు ఏటి సెప్పరేటి?...." అనుకుంటూ రాయి కింద నలిగిన శవాన్ని చూసి "ఓలమ్మోలమ్మ!... ఎంత పనైపోయింది.... ఏ తల్లికి కడుపు శోకం పెట్టినావురా దేవుడా.... ఎవుళ . బొట్టిడమ్మ మారాజు కొడుకు!" అని పరీక్షగా చూసింది. ఆమె చూపులు నీలం బాడీ మీద, గళ్ళలుంగీ మీద నిలిచిపోయాయి. అందరివైపు చూస్తు "మా మనవడేడి!.... అయ్యా!....ఒరెకొండా....!కొండయ్యా! నాయినా మా మనవడేడి!" ఆమె కళ్ళు తన మనవడు కొండడి కోసం ఆత్రంగా వెతుకుతున్నాయి. చుట్టు వున్న ఆడవాళ్ళు వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక ఒక్కసారి ఘొల్లున ఏడ్చేసరికి, అంత వరకు అనుమానంగా వున్న సూరమ్మ నేలమీద కూలబడి శవంపై ఒరిగిపోయింది. గుండెలు బాదుకుంటూ "ఓర్నాయినా!.... ఎంత ఘోరమైపోనాదిరా.... కొడకో.... కొడక....! నన్నన్యాయం సేసి ఎల్లిపోనావురా.... కొడుకో ... కొడక! మీ అమ్మ, అయ్య కాడికెల్లి పోనావురో.... కొడకో.... కొడక! ఈ ముసిలి ముండకి మాయజేసి మాయమైపోనావురా...కొండా....అంటూ రాగాలు తీస్, ఏడవసాగింది. మిగిలిన వారంతా ముసిలిదాని ఏడుపుకు తమ గొంతులు కలిపి ఏడుస్తుంటే పగిలిపోయిన రాళ్ళన్ని ఏక కంఠంతో రోద

స్తున్నట్లుంది.

అప్పుడే అక్కడకు వచ్చిన ప్రెసిడెంట్ చౌదిర్నాయుడు జనాన్ని తోసుకొని ముందుకొచ్చి "హన్నన్నన్న. ఎంత ధారుణం జరిగిపోయింది. ఈడి సావు నాకొచ్చింది కాదు... ఇంత సిన్న వయసులోనే నీకు నూరేళ్ళు నిండి పోనాయిరా" అంటూ దుఃఖించి పైమీదున్న తువ్వాలుతో నీరులేని తన కళ్ళను ఒత్తుకున్నాడు. అక్కడే హృదయాన్ని చించుకుంటున్న ముసిల్దాన్ని ఉద్దేశించి "అప్పా!.... సూరప్ప!.... పల్లకొ. పల్లకోయే ఏటి మన సేతిలోన ఏటుందంతా వేటి. అంత ఆ అయ్యగాడి లీల. సావ కూకున్న మనల్నొగ్గిసి- ఇదుగో ఈ పాలుగారే గుంటడే ఆడికి కావలి నొచ్చినాడా? ఈడు ఇలాగ సెందురుడులాగ ఏటికేడాది పెరిగిపోవడం ఆడికి కూడా కన్ను కుట్టేసింది గావాల. అందుకే అట్టు ఎల్లిపోనాడు. పల్లకో, మరేడకు. మరేడనానికి నీ ఒంట్లో ఏటి మిగల్లేదు. నీ బతుక్కి నీ ఒంట్లో రగతం ఇక్సైపోయింది. మరి ఏడ్వానికి నీ కంట్లో నీరెక్కడిదే." ఓదార్చానికి ప్రయత్నించాడు. అక్కడే వున్న జనంలో కొందరు "ఈడు ఇంతప్పుడు గావాల ఈడ్ని ఈ ముసిల్దానికి ఒప్పగించేసి ఈడి అమ్మ, అయ్య గుడివాడ ఎల్లికోరి కాంటాక్టు లారీ పెమాదంలో పేనాలొగ్గిసినారు. అదుగో అప్పుణ్ణించి ఆ కండని ఈ కొండలాగ సేసింది.... ఇందుకే గావాల...."

"తన అకలి మరిసిపోయి ఆడి అకలి తీర్చింది ముసిలి. గుంటడికి కష్టమంటే ఏటో ఎరగనిచ్చింది గాదు. గాజుసామాను సాకినట్టు సాకింది. గాన్నైటు బాపులకి బలిచ్చినానికే గావాల. సెట్టంత కొడుకు, కోడలు పోయినపుడే సగం సచ్చిపోయింది. ఇదుగో! మల్లీ ఇప్పుడీ గోరం...." అంటు నలుగురు సానుభూతి మాటలు పలుకుతుంటే అవి విన్న సూరమ్మ భరించలేక "అయ్యో!.... కొండా!.... నిన్నొగ్గి నేనుండలేనురా.... నన్ను కూడా నీ దగ్గిరికే తీసుకుపోరా.... నీ తోడే నేను పాకొస్తానుంట్రా...." అని పక్కనే వున్న రాయికేసి తల బాదుకోసాగింది. ప్రెసిడెంట్ చౌదిర్నాయుడు ఆమెను ఆపి, "అప్పా! నా మాటిను. ఆడితోటే నీకు సరనుకున్నావా. మావంతా లేమా. నీ కష్టం మా కష్టం కాదా! సెప్పు. నువ్వేం బెయ్యం పడకు. నీకు ఏ అన్నాయం జరక్కుండా నేను సూత్తాను. ఈ అకరి రోజుల్లో నీకు ఏ లోటు రాకుండా నేను ఏర్పాటు సేత్తాను. నువ్విప్పుడు కొంచం తాగాలి." అని పక్కనున్న వాడితో "ఒరయ్యో! అల్లా ముంతతోటి కసిన్ని నీళ్ళట్టుకొచ్చి ముసల్దానికియ్యరా" అని పక్కనున్న ఒక కుర్రవాణ్ణి పంపించాడు. ప్రెసిడెంట్ మాటలు అక్కడున్న వారికి అర్థం కావటంలేదు. ఆయన ఆమె మీద ఎందుకంత జాలి చూపిస్తున్నాడో, ఎవ్వరికి బోధ పడటం లేదు. అయినా ఎవ్వరి సానుభూతి మాటలు గాని సూరమ్మ బాధని తగ్గించలేక పోతున్నాయి.

కొండకి పట్నంతో కలుస్తున్న

కొండదారి మీది నుంచి దూసుకొచ్చిన తెల్లటి కారు, తెల్లటి బట్ట లేసుకున్న నల్లటి ఆకారం- అతని వెనక గన్‌మేన్, మరో నలుగురు మనుషులు దిగి దిగడం తోటే కొండవైపు రాసాగారు. వార్ని చూసి, ప్రెసిడెంట్ చౌదిర్నాయుడు జనాల్ని, ముసిల్దాన్ని ఉద్దేశించి, "అదుగో మన మినిష్టర్ ధర్మరాజుగారు వత్తన్నారు అతగానికి ఇందాక నేనే ఫోను సేసి ఇక్కడ జరిగిన గోరాన్ని సెప్పినాను. మారాజు తండ్రి ఫోనులోనే గొప్ప బాధ పడిపోనాడు. మరి అక్కడ వుండలేక పోయాడు గావాల. పారొచ్చినాడు. దండాలు బావ్" అని ఎదురెల్లాడు.

అక్కడ చేరిన ప్రజలకి ఇది చాలా విచిత్రంగా వుంది. రోజు కొన్ని వేల మంది దిక్కుమాలిన చావులు చస్తున్న ఈ దేశంలో ఈ కొండడి చావుకి సాక్షాత్తు మంత్రిగారే ఎందుకు వచ్చారో అర్థం కావడం లేదు. మినిష్టర్ వచ్చి రావడం తోటే సూరమ్మతో "అమ్మా! నీవు మా కంటె చాలా పెద్ద దానివి. నీకు చెప్పాల్సిన వయసు గాని, ధైర్యం గాని లేని వాళ్ళం. ఇలాంటి సమయంలో నీవు గుండెని రాయి చేసుకోవాలి. అంతా ఆ పైనున్న వాడి లీల. మన మేమాత్రం? ఎందుకు పుట్టిస్తాడో- ఎందుకు తీసుకొని పోతాడో- అతనికే తెల్సు. నీకు జరిగిన ఈ అన్యాయం పూడ్చడం ఎవ్వరి వల్ల కాదు గాని మాకు చేతనైన సహాయం మేం చేస్తాం. ఇదుగో ఈకంపెనీ కాంట్రాక్టర్లతో నేను మాట్లాడాను. నీకు ఈ ఆఖరి రోజుల్లో ఎటువంటి లోటు రాకుండా లక్ష రూపాయిలు ఆర్థిక సహాయం చెయ్యడానికి అంగీకరించారు. దానితో నీ బ్రతుకు ఆనందంగా గడిచి పోతుంది" అంటు ముగించాడు.

మంత్రిగారి మాటలు అక్కడి వార్ని ఆశ్చర్యంలో ముంచాయి. దిక్కుమాలిన శవానికి లక్ష రూపాయలా! జీవితాంతం కష్టపడినా కనీసం వెయ్యి రూపాయలు అయినా కూడ బెట్టనివాడు, చస్తే లక్ష రూపాయలా! అసలు అంత సొమ్ము ఎందుకిస్తున్నారో అర్థం కావడంలేదు. ఇలాంటి సమయంలో తమ యూనియన్ లీడర్ లేకపోవడం వల్ల వారికి ఏమి తోచడంలేదు. అతడు లేకుండానే ఇక్కడ సెటిల్మెంట్ తతంగం అంతా పూర్తి చేయిస్తున్నారు. అప్పలసూరికి అంతా చిరాకుగా వుంది. ప్రకాశం బాబు గనక వుంటే వ్యవహారం మరోలా వుండేది. అసలు తను పంపించిన కబురు అందిందో లేదో-అసహనంగా చూస్తున్న అతడి కళ్ళకు ఇందాక తాను పంపించిన సత్తిం కనిపించగానే పక్కకు పిల్చి "అవున్రా సత్తిం! పెకాశం బాబుకి పిల్చినావా?" అడిగాడు.

"లేదు" అన్నాడు వాడు.

"ఏం? ఎందుకు పిల్లేదు?" కోపంగా అడిగాడు.

"సైకిలుకని పూర్లోకెల్లినాన. అక్కడ మన పెసిడెంట్ సౌదిర్నాయుడు అడ్డుపడి- 'ఈపాటి దానికి అతగాడెల్లేలా. నాను లేనా- నాయం సెయ్యానికి-

(తరువాయి 18వ పేజీలో)

సాంస్కృతిక సామ్రాజ్యంపై అఖిల భారత సదస్సు పత్రాలు : 1

దళారీ సంస్కృతి - దాని రూపాలు

— దివికుమార్

సంస్కృతి అంటే జీవితమంత విశాలమైనదీ, లోతయినదీ కాక సంఘర్షణాత్మకమైనదీ, మార్పులకు గురయ్యేది కూడా. మానవీయ ఆలోచనలూ, సామాజిక ప్రవర్తనా, ఆచరణలలో సంస్కృతి వ్యక్తమవుతుంది. ఒకానొక సమాజం యొక్క ఆర్థిక, రాజకీయ, సాంఘిక జీవితం యొక్క సమస్త భావజాలపు ఆచరణాత్మక ప్రతిబింబమే సంస్కృతి.

మనం సాధారణంగా భూస్వామ్య, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద, సోషలిస్టు సంస్కృతుల గురించీ, అలాగే ప్రజాస్వామ్య, నూతన ప్రజాస్వామ్య సంస్కృతి గురించీ విని వుంటాం. దళారీ సంస్కృతి అనేది కొత్తదేమీ కాదుగానీ, దాన్ని అలా పిలిచే అలవాటు తక్కువ.

భూస్వామ్య వ్యవస్థకూ, సామ్రాజ్య వాదానికీ జన్మించి వెన్నుపూసా, వ్యక్తిత్వమూ లేకుండా పెరిగే పెట్టుబడిదారీ వర్గాన్నే దళారీ బూర్జువా వర్గం అంటున్నారు. గత 47 సం॥లుగా భారతదేశపు రాజ్యాధికారంలో భాగస్వామ్యం గల బడా బూర్జువా వర్గం యొక్క స్వభావం దళారీ తత్వంతో కూడుకున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే నేటి అర్థ వలస, అర్థ ఫ్యూడల్ వ్యవస్థ యొక్క భావజాలపు ప్రతిబింబమే దళారీ సంస్కృతి.

ఇది భారత పాలక వర్గాలైన బడా బూర్జువా- బడా భూస్వామ్య వర్గాలు, నిరంకుశాధికారుల సంస్కృతి. ఇదీ సామ్రాజ్య వాదుల వలసవాద- నేటి కాలంలో పునర్వలసవాద- సంస్కృతి భారతీయ ఫ్యూడల్ సంస్కృతితో మిలాఖత్ అయి దేశీయ నామంతో ప్రజలపై రుద్దబడుతున్న సంస్కృతి. ఇది విద్య, సాహిత్యం ఆచార వ్యవహారాలు, సంగీతం, కళారంగం, పత్రికలు, సినిమా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా భావజాలంగా రూపొంది, సామాజిక విలువలుగా మారి సంస్కృతిగా- జీవన విధానంగా- స్థిరపడుతుంది.

యూరోపియన్ దేశాలలో భూస్వామ్య విధానానికీ, రాచరికానికి వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చిన పెట్టుబడిదారీ వర్గం ఒకానొక దశలో నిర్వహించిన ప్రగతిశీల తత్వంతో వ్యాప్తి చేసిన బూర్జువా ప్రజాస్వామ్య విలువలు భారతీయ మేధావులను కూడా కొందరిని ప్రభావితం చేసి, ఇక్కడ కొన్ని ఉదారవాద మార్పులకు దోహదపడ్డాయి. పెట్టుబడిదారీ విధానం స్వతంత్ర స్వభావాన్ని సంతరించుకుని తన అంతిమ దశ పతన దశ అయిన సామ్రాజ్యవాదంగా మారిన తర్వాత పూర్తి

అభివృద్ధి నిరోధకంగా తయారైంది. నాటి నుండి శ్రామిక వర్గ సిద్ధాంతమూ, అక్టోబరు విప్లవ స్ఫూర్తే ప్రగతిశీల మార్పులకు చోదక శక్తిగా పనిచేస్తూ వస్తున్నాయి.

బ్రిటీషు సామ్రాజ్యవాదులు భారత ప్రజలపై రుద్దిన భావాలలో రెండింటిని పేర్కొనటం అవసరం.

1. భారతీయులు ఆధ్యాత్మిక, ఆముష్మిక జీవులు. వారు భౌతిక జీవిత వ్యామోహాలకు అతీతంగా ఆధ్యాత్మిక జీవన మందిరాలలో ఆనందంగా విహరిస్తూ వుంటారు.

2. భారతదేశపు చరిత్రంతా అన్యుల దురాక్రమణ చరిత్ర. స్థానికుల లొంగుబాటు చరిత్ర. బానిసత్వం భారతీయుల సహజ లక్షణం.

పై భావజాలం ద్వారా మన పోరాటాల చరిత్రను పూర్తిగా మరుగుపరుస్తారు. బ్రిటీషు సామ్రాజ్యవాదుల దోపిడీని, దాని దుష్ఫలితాలను ఎదుర్కొనలేమనే భావాన్ని

(16 వ పేజీ తరువాయి)

అతగాడొస్తే తేల్చివ్వాడు' మునగనిప్పాడు. మరెల్లకులేరా అని అనిసినాడు. అందుకే మరి పిల్లేదు" అన్నాడు.

ఏం జరుగుతుందో మెల్లగా అందరికి అర్థంఅవుతున్నది. ఇంతసొమ్ము ఎందుకు ఎర వేస్తున్నారో బోధపడ్తుంది. ఇంతటి జాలి, సానుభూతి ఎందుకు కురిపిస్తున్నారో తెలిసి వస్తున్నది. జనం కళ్ళు నిప్పు కణికల్లాగ మారుతున్నాయి. ఆ కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి.

మినిష్టర్ ధర్మారావుకు సుందర రామరాజు చెక్కు అందించగా- దానిని అతడు సూరమ్మ చేతిలో పెట్టాడు. ఫొటోగ్రాఫర్ కెమెరా ఫ్లాష్ వెలిగింది. ముసల్దాని చేతిలో లక్ష రూపాయలచెక్కు- నిలుపలేక రెపరెపలాడుతూ గాలికి ఎగిరి ప్రక్కన పడింది ఆమె కళ్ళు కనీసం ఆ చెక్కువైపు చూడనైనా చూడటం లేదు. ఆమె కళ్ళ నుండి తుళ్ళిన చూపులు ఆకాశాన్ని నిలదీస్తున్నాయి.

'తరిగి పోతున్న కొండ ఎక్కడికి తరలిపోతుందా' అని ప్రశ్నిస్తున్నాయి ఆ చూపులు. ఇన్నాళ్ళ కొండని కాపలా కాసిన బండ బతుకులకు ఏం మిగిలిందని ఆక్రోశిస్తున్నాయి ఆచూపులు.

ఎక్కడి నుండో వచ్చిన కాంట్రాక్టరుకి ఈ కొండల్ని దత్తత ఇస్తున్న శక్తుల కోసం వెతుకుతున్నాయి ఆ చూపులు.

జనం కళ్ళు కలుసుకోకుండా- ఆ కళ్ళల్లోని నిప్పులు రగలకుండా చేసిన కుట్రకు కారణాలు తవ్వి తీస్తున్నాయి ఆ చూపులు.

అయినా రేపో మాపో కళ్ళు కలుసుకొని మాట్లాడతాయ్. సూరమ్మ చూపులకు సమాధానాలను చర్చిస్తాయ్.

కొండకి కిందనున్న గ్రామం చుట్టు కమ్మిన కారు మబ్బుల్ని చీల్చుకుంటు ఎగబొడుస్తున్న సూర్యుడిలా ప్రకాశం ఇటు వస్తున్నాడు.

సృష్టించి భారతీయుల్ని నిష్క్రియాపరులుగా మార్చటం, వారి ముందు మెదలు వంచి తల ఒగ్గక తప్పదనే భావాన్ని సృష్టించారు. సారాంశంలో సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా పోరాడాలనే స్పృహనూ, చైతన్యాన్నీ కలుగనీయకుండటం బ్రిటీషు వారి విధానం.

పై భావజాలం ఒకప్పుడు వలస విధానానికి ఆమోదం తెలిపేదిగా తయారు చేయబడితే ఈనాడదే పునర్వలస ఆర్థిక రాజకీయ విధానాలకు తలలు ఊపేదిగా రూపొందించబడుతోంది. ముఖ్యంగా ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన 'సరళీకృత' నూతన పారిశ్రామిక ఆధునీకరణా, ఆర్థిక విధానాలను ఆమోదించక తప్పదనీ, భూమండలీకరణ (Globalisation) లో భాగంగా వేరుబడి వుండలేమనీ; IMF, ప్రపంచ బ్యాంకు అప్పులకు- GATT ఒప్పందాలకు S.A.P. (Structural Adjustment Policies) కి భిన్నంగా వుండలేమనీ; బహుళజాతి సంస్థలకు ప్రైవేటీకరణకు అతీతంగా బతకలేమనీ, పోటీ పడటమో లేక నాశనమవటమో తప్ప మార్గం లేదనీ, దేశాభివృద్ధికి, ఉనికినీ ఇది తప్ప గత్యంతరం లేదనే భావజాలాన్ని పాలకులు ప్రజలకు బాగా ఎక్కిస్తున్నారు. పెటీ బూర్జువా మేధావులలో అత్యధికులు దీనికి తలలూపుతున్నారు. ఈ బానిస సంస్కృతే సామ్రాజ్యవాద దేశాలు వెనకబడిన దేశాలపై రుద్దే నయావలస సంస్కృతి! స్థానిక భూస్వామ్య సంస్కృతితో యిది మిలాఖత్తై తద్వారా ఏర్పడిన సంకర సంస్కృతినే మనం దళారీ సంస్కృతి అంటున్నాము.

ఈ భావజాలం వల్ల సామ్రాజ్యవాదుల సరికొత్త 'దురాక్రమణ'ను మౌనంగా ఆమోదించే భావదాస్యం వ్యాప్తి చెందుతోంది. 1947లో మనకు లభించిందనుకున్న స్వాతంత్రం యొక్క బూటకత్వం క్రమేణా పై పరిస్థితికి దారి తీయించిందని మనం అర్థం చేసుకోవాలి. ఇది భారతీయ సమాజంపై ఎంత తీవ్రమైన ప్రభావాన్ని కలిగించిందంటే- గత 200 సం॥లలో బ్రిటీషు సామ్రాజ్యవాదులు సాధించలేనిదాన్ని ఈ 50 సం॥ల లోపలోనే దళారీ పాలకులు సాధించారని చెప్పవచ్చు.

విశాల భారతదేశాన్ని పరిపాలించడానికి తమ విధేయులుగా పడివుండే గుమాస్తాలను తయారు చేసుకోవానికి రూపొందించబడిన మెకాలే విద్యా విధానమూ, ఇంగ్లీషు భాషా వ్యాప్తి కేవలం సామ్రాజ్యవాదుల పట్ల బానిస మనస్తత్వాన్నే కాక స్థానిక ప్రజలకంటె గొప్పవారమనే ఆధిపత్య భావాన్ని కూడా సృష్టించింది. A knowledge of English gave scope to enjoy certain undue previliges by a section of people. ఉన్నత విద్యా ఉపాధి సాధనకూ ఇంగ్లీషు భాషా జ్ఞానం తప్పనిసరి అనే వాతావరణం వల్ల 3-4 ఏళ్ళ పసిపిల్లలను కూడా LKGలో చేర్పించే సంస్కృతి, రెసిడెన్షియల్ విద్యా విధానమూ పట్టణాల

నుండి మారుమూల గ్రామాలకు కూడా గత 10 సం॥లుగా వ్యాపించింది. అదీ అనుకరణ నుండి వ్యామోహ స్థితికి చేరుకొనడం తీవ్రమైన పోటీకి దారితీసి చాలా కొద్ది మందిని పై మెట్టుకి పంపి అత్యధికులను అట్టడుగుకి నెట్టివేస్తోంది. ఇంగ్లీషు భాషా జ్ఞానం భావజాల రంగంలోన అధిపత్యం చలాయించటంతో పాటు కొద్ది మంది విద్యావంతులను కూడా అధికులూ, అధములూ అనే విభజనకు గురి చేస్తోంది మెజారిటీ ప్రజలను అణచివుంచే ఒక సాధనంగా ఇది రూపొందింది. ఇంగ్లీషు భాషా వ్యామోహం వల్ల మాతృభాష పట్ల చిన్న చూపూ, వైముఖ్యం పెరుగుతున్నట్టే దుస్తులూ, సరుకులూ, వైద్యమూ, మందులూ, సంగీతము, సాహిత్యమూ, కళా రూపాలూ, అలా అన్నిటిలో విదేశీ మోజు జాతీయ న్యూనతా భావం వ్యాప్తి జరుగుతున్నది.

ఎంతో సాంస్కృతిక సంపదకు సృష్టికర్తలైన ప్రజలు ప్రేక్షకులుగా, శ్రోతలుగా మిగిలిపోయే వాతావరణం కల్పించబడింది. తరతరాల మన సాంస్కృతిక కళారూపాల సంపదను దళారీ సంస్కృతిక తిమింగలాలు దిగమింగుతూ ప్రజల యొక్క సాంస్కృతిక సృజనాత్మక శక్తులను నిశ్శబ్దంగా అణచి వేస్తున్నాయి. మనవైన కోలాటాలూ, బుర్రకథలూ, ఒగ్గు కథలూ, భాగవతాలూ, యక్షగానాలూ పాటలల్లుకునే అలవాట్లు క్రమేణా క్షామ పీడిత ప్రాంతాల్లో భూజలంలా అడుగంటిపోయాయి. మనవైన గ్రామీణ క్రీడలు, సామూహికంగా పాల్గొన గలిగే ఆటలు పనికిమాలిన వన్న భావం పెంచి క్రికెట్టు, టెన్నిస్ లాంటి వ్యక్తి ఆధిక్యతను చాటే వాటిని టి వీల్లో బయటా చూసి ఆనందించటం అలవాటు చేయబడింది. విద్యార్థులు మార్కులు పెట్టే పారం కోళ్ళుగా మార్చివేయబడ్డప్పుడు. ప్రేక్షక తత్వం పెంచబడుతున్నప్పుడు- క్రీడాసక్తి అడుగంటడంలో, ఆటస్థలాలు పందుల వాహ్యాళి కేంద్రాలవటంలో ఆశ్చర్యమేముంది?

నక్సల్‌బరీ యుగంలోని ప్రజా సాంస్కృతికోద్యమ కృషి ఫలితంగా ప్రజల్లో నిక్షిప్తమై వున్న జానపద సంపదనూ, దాని ఔన్నత్యాన్నీ వెలికి తీసి, మెరుగు పెట్టి విప్లవీకరించిన నేపథ్యాన్ని కూడా దోపిడీ సాంస్కృతిక శక్తులు వినియోగించుకుని జానపద బాణీలలో అశ్లీల భూస్వామ్య భావాలను నింపి ప్రజలను నిర్వీర్యులుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. పాప్ మ్యూజిక్ వాయిద్యాలు, జానపద పాటల బాణీలు, అశ్లీల సాహిత్యమూ, కామ వికారపు చూపులు, వంపుసొంపుల విన్యాసాలతో కలగలపి సిల్కుస్మిత లాంటి వాళ్ళు యిస్తున్న నృత్య ప్రదర్శనలు, మాల్గాడి శుభ పాటలు ఇటీవలి కాలపు దళారీ సాంస్కృతిక మురుగు ముంపుగా ప్రవహిస్తోంది. ఏడెనిమిది దశాబ్దాల క్రితం భూస్వామ్య సంస్కృతి వికృత రూపంగా వుండిన మేజువాణీ ప్రదర్శనల ఆధునిక దళారీ సాంస్కృతిక రూపమే రికార్డు డ్యాన్సులు, సిల్కుస్మిత ప్రదర్శనలు!!

అలంకరణ, వస్త్ర ధారణలో అనుకరణకూ, భూస్వామ్య సామ్రాజ్యవాద సంస్కృతుల మేళవింపుకూ రెండు చిన్న ఉదాహరణలు చూడండి.

మ్యాచింగ్ దుస్తులనే ఫ్యాషన్ ద్వారా బట్టల వ్యాపారాన్ని పెంచుకున్న బడా బూర్జువా వర్గాలు- భూస్వామ్య సంస్కృతిలో భాగంగా వుండిన 'ఎర్రబొట్టు'ను కూడా మ్యాచింగ్ పరిధుల్లోకి ఈడ్చేశారు. కుంకుమ, లేక తిలకం బదులు బొట్టు బిళ్ళలు మార్కెట్లోకి వచ్చాయి. చీర బ్లౌజు, గాజులు ఏ రంగువి ధరిస్తే అదే రంగు బొట్టు బిళ్ళలు అంటించుకోవాలన్నమాట!

ఒక చిన్న కవితను చూడండి-

"పాచి రంగు జీన్సు పాంటు
లూజు లూజు 'బుష్' కోటు
కాలికి 'యాక్షన్' బూటు
మోజునికి బోడి గుండు
అపై ఎంతో మోజుగా
వోజు కొట్టు బొచ్చు హ్యాటు"
(గజ్జెల మల్లారెడ్డిగారి సౌజన్యంతో)

ఈనాటి అత్యధిక నగరాల్లో, పట్టణాల్లోని యువతరంలో గమనించే వేష ధారణ యొక్క వర్ణన పై కవితలో చూడవచ్చు. వేగంగా మారిపోయే ఫ్యాషన్ల ప్రభావం ఈ యువతరం మీదే ఎక్కువగా వుంటోంది. భారత పాలక వర్గాలు దేశ భక్తినీ, ప్రజాస్వామ్యాన్నీ- బిజెపి వాళ్ళు లౌకిక వాదాన్నీ బూతు పదాలుగా మార్చేసినట్లు పై తరహా యువతరం నేటి సాహిత్యం, సినిమాల, వీడియోల ప్రభావంలో ప్రేమ, స్త్రీ పురుషుల సమానత్వం, సామాజిక బాధ్యత, రాజకీయ చైతన్యం, త్యాగ సాంప్రదాయం ఇలాంటివి పనికిమాలిన విషయాలుగా భావిస్తున్నారు.

తరతరాలుగా భూస్వామ్య వ్యవస్థ సృష్టించిన 'వ్యక్తివాదం' తాత్వికంగా జీవిత సమస్యలకు పరిష్కారంగా వైయక్తిక మోక్షాన్ని బోధించింది. అందుకు వర్ణ ధర్మమూ, స్త్రీ ధర్మాలూ, ఫ్యూడల్ రాచరికపు దోపిడీ పీడనలను ఆమోదించి పాటించటమే మార్గంగా ప్రబోధించింది. అది ఈనాటి సాంస్కృతిక సామ్రాజ్యవాద ప్రభావానికి గురై వైయక్తిక ఆనందమూ, భోగతత్వమూ అలవదేట్టు చేస్తోంది. దానికి డబ్బు సంపాదనే ఏకైక మోక్ష మార్గంగా చూపుతోంది. మోక్షాన్ని పొందటానికి చెడ్డ దారుల్లో ప్రయత్నించటం కూడా తప్పుకాదని ఫ్యూడల్ పురాణ నీతులు ఎటూ నేర్పుతున్నాయి కదా! అందుచేత డబ్బుకోసం పెంపర్లాట, పోటీ, మోసం, అవినీతి, హింస, ద్వేషం.... ఇలా సమస్త అమానవీయతలు జీవితంలో చోటు చేసుకుని డబ్బు సంస్కృతి విషవలయంలో గిరికీలు కొడుతున్నాయి.

పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద సంస్కృతులు 'వ్యక్తి' వాదాన్ని చివరి అంచుల దకా సాగలాగుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా పోరాడకుండా వ్యక్తులు, జాతులు, దేశాలు, ప్రజలు మానవీయ విలువల పునాదులపై నిలబడటం సాధ్యం కాని పరిస్థితి దాపురించింది.

బ్రిటీషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రజల ఆగ్రహానికి అడ్డుకట్టలు వేయటంలోనూ, విద్రోహకర పాత్రను నిర్వహించటంలోనూ నైపుణ్యం పొందిన గాంధీ నెహ్రూల నాయకత్వంలోని కాంగ్రెసు పార్టీ భారత సమాజంలోని వైరుధ్యాలను బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల ప్రయోజనాల కనుగుణంగా అణచి వుంచుతూ, పక్కదారి పట్టిస్తూ వచ్చింది. తదనుగుణమైన భావజాలాన్నీ సాంస్కృతిక విలువలనూ పెంచి పోషిస్తోంది. సంక్షోభం చివరి స్థాయికి చేరినపుడు పాలకులు మరింత నగ్నంగా బయట పెట్టుకుంటూ వస్తున్నారు. అలనాటి స్వాతంత్ర్య పోరాట కాలంలో వారు వ్యాప్తి చేసిన దళారీ భావజాలం ఈనాడు అణచివేత సాధనాలుగా వినియోగించుకుంటున్నారు.

భారతీయులంతా ఒకే జాతి అనే సిద్ధాంతం ఈనాటి కాశ్మీరు, ఈశాన్య ప్రాంతాలు, పంజాబులలో క్రూర అణచివేతకు ఆమోదముద్ర వేయించుకోడానికి- ఇతర జాతుల, ఉపజాతుల ప్రజలు తమ "వ్యక్తిత్వాన్ని" ప్రకటించనీయకుండటానికీ దోహద పడుతోంది. అదే సమయంలో సామ్రాజ్యవాదులూ వాని అనుచర బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలు దేశపు మారుమూల ప్రాంతాలను కూడా తమ దోపిడీ గుప్పెట్లో బంధించ గలుగుతున్నారు.

"అన్నీ వేదాలలోనే ఉన్నాయిష" అన్నట్లు ప్రాచీన ఔన్నత్యం పేరిట ఫ్యూడల్ రాచరిక వ్యవస్థనూ వర్ణకుల ఆధిపత్యాన్నీ పురుష దురహంకారాన్నీ ఆమోదింప జేయటానికి జరిగిన ప్రయత్నం ఈనాడు తీవ్ర మత విద్వేషాలకూ- కలహాలకు; కుల పీడనకూ, దాడులకూ; మహిళలపై అత్యాచారాలకూ ప్రేరణ నందిస్తోంది. భూస్వామ్య సామ్రాజ్యవాద దోపిడీ పీడనల ఫలితంగా తీవ్రతరమవుతున్న సామాజిక జీవితం యొక్క దుర్భరత్వం సాధారణ ప్రజలను అశాంతి అభద్రతల్లోకి నెట్టివేసి కర్మ సిద్ధాంతాన్నీ, మూఢ విశ్వాసాలనూ, అతీత శక్తుల కరుణకు తపించే వారిగా తయారు చేసింది. స్వయంగా పరిపాలకులే బాబాలనూ, అమ్మలనూ, పీఠాధి పతులనూ పూజిస్తూ, నేటి సామాజిక దుస్థితికి తాము నిమిత్తమాత్రుల మన్నట్టుగా మోసకారి వేసంతో వ్యవహరిస్తున్నారు.

బాబాల, స్వాముజీల చుట్టూ తిరిగే రాజకీయ నాయకులూ, కోటీశ్వరులూ, ఉన్నతాధికారులూ జీవితంలోని అశాంతికీ- అభద్రతకూ మూలం భౌతిక కోర్కెలూ వ్యామోహాలూ అని చెప్పే నీతులు విని వచ్చిన వెంటనే.... ఏ 'స్కాం' కుంభకోణంలోనో, అవినీతి కుంభకంలోనో, సిమెంటు చౌర్యంలోనో, కార్మికులను కాల్చి

చంపించటంలోనో, ఎన్‌కౌంటర్ల ప్రహసనంలో నిర్విచారంగా పాలు పంచుకుంటారు. ప్రజల యొక్క సంఘటిత శక్తినీ, పోరాట పటిమనూ ఏనాడూ ప్రోత్సహించని ఈ బాబాలూ, స్వామీజీలు, పీఠాధిపతులూ ఫ్యూడల్ నీతులను, వైయక్తిక పరిష్కారాలను ప్రజలకు బోధిస్తూ తాము మాత్రం పరిపాలకుల అండ దండలతో విమానాలెక్కి సామ్రాజ్యవాద దేశాలను సందర్శిస్తున్నారు. తమ భోగాలకు ఏలోటూ లేకుండా చూసుకుంటున్నారు. ఆచార్య రజనీష్ మహేష్‌యోగి, పుట్టపర్తి బాబా, ధీరేంద్ర, బ్రహ్మచారి అట్లాంటి అనేక మంది దళారీ పాలకుల అండదండలతో విలాసవంతంగా బతుకుతూ ప్రజలను భూస్వామ్య, సామ్రాజ్యవాద భావజాలంతో అణచి వుంచుతున్నారు.

డంకెల్ ప్రతిపాదనలూ, గాట్ ఒప్పందాలపై సంతకాలు పెట్టి దేశాన్ని పునర్వలసగా మార్చే ఈనాటి ప్రయత్నాలకు పుష్కర కాలం ముందు నుండే సామ్రాజ్యవాదంపై ఆర్థికంగా మరింత ఆధారపడే విధంగా ప్రపంచ బ్యాంకు, IMF అప్పులు పుచ్చుకుంటూ సంక్షోభ భారాన్ని ప్రజలపై తీవ్రంగా రుద్దటం దేశంలో జరుగుతూ వచ్చింది. విద్యా, ఉపాధి అవకాశాలను కుదించి వేయటం, ప్రభుత్వరంగ సంస్థలను దోచిపెట్టటం, ప్రైవేటీకరణకు దారులు వెదల్పు చేయటం జరిగింది. ఈ కాలంలోనే అమృత్‌సర్ స్వర్ణ దేవాలయంపై ఆపరేషన్ బ్లూ స్టార్, ఇందిరాగాంధీ హత్యానంతరం సిక్కులపై హత్యాకాండ, పెచ్రేగిన హిందూ మతోన్మాదతత్వం, మండల్ కమీషన్‌కూ, దళిత కులాలకూ వ్యతిరేకంగా కుల దురహంకారుల ప్రదర్శన, ఆంధ్రాలో వంగవీటి మోహనరంగా హత్యానంతరం కుల విద్వేషపు దాడులూ, ప్రజా పోరాటాల్ని అణచివేయటానికి సమస్త పౌర- మానవ హక్కులను ఉల్లంఘించటమూ, బాబ్రీ మసీదు కూల్చివేత, మైనారిటీలపై దాడులు లాంటి అనేక సామాజిక సంఘటనలు జరిగాయి. మరట్వాడా విశ్వవిద్యాలయం పేరు విస్తరణ ఆందోళనకు వ్యతిరేకంగా మహారాష్ట్రలోని అన్ని పాలక వర్గ పార్టీలు కలిసి దళితులపై దాడులు, ఊచకోతలు జరిపాయి. గత సం॥పు హోలీ పండుగనాడు రాజస్తాన్‌లోని కొన్ని గ్రామాల్లో దళితులు కూడా హోలీ ఆడినందుకు ఆగ్రహించిన కులోన్మాదులు దాడులు చేసి ఊచకోత కోశారు.

పై చర్యలన్నీ సంక్షోభాన్ని పరిష్కరించే ప్రయత్నం కాకుండా సామ్రాజ్యవాదులు దేశాన్ని దోపిడీ చేసుకోడానికి వీలుగా స్వేచ్ఛగా గేట్లు బార్లా తెరవటమూ, దానికి వ్యతిరేకంగా ప్రజలను ఆలోచించనీయకుండా సామాజిక ఉద్రిక్తతలను రెచ్చగొట్టి ఫాసిస్టు ఉన్మాదాలను వ్యాప్తి చేయటమూ- పోరాడితే అణచివేయటమూ ఒక విధానంగా నిర్బంధ సంస్కృతిగా పాలక వర్గాలు రూపొందించారు.

పైన పేర్కొన్న సంఘటనల కాలంలోనే దేశవ్యాపితంగా, అత్యంత

వేగంగా టి.వి. ట్రాన్స్మిటర్లూ, ప్రసారాలూ విస్తరించాయి. సామ్రాజ్యవాదుల ప్రసార యంత్రాలకు, టి.వి. సెట్లకు బ్రహ్మాండమైన మార్కెట్టుగా భారతదేశం పఉయోగ పడింది. మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడా 'పబ్లిక్ కమ్యూనిటీ' టి.వి. సెట్లను ఏర్పాటు చేశారు. ఇందిరాగాంధీ వ్యక్తి పూజా (Personality cult) తత్వంతో ప్రారంభమైన ఈ విస్తృత ప్రసారాలు.... మైనారిటీ (సిక్కుల) వ్యతిరేక ప్రచారపు రూపం తీసుకుని చివరికి ఆమె హిందువుల ఏకైక ప్రతినిధిగా ప్రతిష్టించే విధంగా తయారయింది. ఈ కాలంలోనే రామాయణ, మహాభారతాలను జనరంజకంగా ప్రసారం చేస్తూ హిందూ మతోన్మాద భావజాలాన్ని వ్యాప్తి చేయటం కూడా జరిగింది. ఈ భూస్వామ్య సాంస్కృతిక నిరంకుశ విలువలకు సామ్రాజ్యవాద సంస్కృతియైన వస్తు వినియోగ తత్వాన్ని (Consumerism) మేళవించి పతన విలువలను, దళారీ సంస్కృతులను పెంచి పోషించటంలో ఈనాడు రకరకాల టి.వి. ప్రసారాలు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయి.

నూటికి ఇరవై మాత్రమే వుండే ఉన్నత మధ్య తరగతీ, ఆ పై వర్గాల వారికి అవసరమయే వస్తువులను, నిద్రలేవగానే అవసరమయే టూత్ బ్రష్షుల, పేస్టుల నుండి రాత్రి నిద్రబోయే ముందు వాడే దోమల నివారణ జెట్లదాకా వ్యాపార ప్రకటనలు గుప్పించి, ఎన్ని వస్తువులుంటే అంత గొప్ప నాగరికతగా భావించే సంస్కృతిని రుద్ది, సామ్రాజ్యవాదుల కంపెనీలకు మార్కెట్టుని పెంచారు. సాంప్రదాయకమైన పెన్నులూ, ఇంకులూ, దేశవాళీ పరిజ్ఞానాన్ని ఆధునీకరించకుండా, విదేశీ బాల్ పాయింట్ పెన్నులు వీరవిహారం చేయడానికి అవకాశాలు కల్పించాడు. సామ్రాజ్యవాద కంపెనీల, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం, మోటారు వాహనాల వస్తు వినియోగ తత్వం పైవర్గాలలో విపరీతంగా పెరిగింది. సామ్రాజ్యవాదులకు ఊడిగం చేయటంలో భాగంగా పై రకాల వస్తువులు కొనుగోలు చేయటానికి రుణ సౌకర్యాలనూ, వాయిదాల పద్ధతినీ కల్పించారు. దీన్నే అభివృద్ధిగా, దేశ ప్రగతిగా ప్రచారం చేస్తున్నారు. ఈ పరిస్థితి మన చేతి వృత్తులనూ, చిన్న పరిశ్రమలనూ ఘోరంగా దెబ్బతీసి, ఉపాధి అవకాశాలను బాగా కుదించి వేశాయి. అత్యధిక ప్రజానీకానికి కావలసిన తిండి, గుడ్డ, యిల్లులాంటి కనీస అవసరాలు, విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, తాగునీరు, రవాణా తదితరాలు మృగ్యమైపోయాయి. కుటుంబ హింసనూ, స్త్రీలపై అత్యాచారాలను పెంచే మద్యపానాన్నీ, బ్లూ ఫిల్ములనూ, అశ్లీల సాహిత్యాన్నీ గ్రామగ్రామానికీ సరఫరా చేస్తున్నారు. దళారీ సంస్కృతి మహిళలపై రాజ్యహింస, కుటుంబ హింస రూపంలో తన వికార తత్వాన్ని ప్రదర్శిస్తోంది.

అర్ధ వలస - అర్ధ ఫ్యూడల్ వ్యవస్థలో స్త్రీ పురుషుల మధ్య పరస్పరం గౌరవించుకోగలిగిన ప్రేమకు నిజమైన ఆస్కారం లేదు. భూస్వామ్య- సామ్రాజ్యవాద విలువలను ప్రశ్నిస్తూ ఆదర్శనీయమైన భావాలను కొన్ని సినిమాలు కొంత

కాలం ప్రచారం చేశాయి. కాలక్రమంలో కాంట్రాక్టర్లూ, సిమెంటు కుంభకోణాల్లో- ప్రభుత్వ నిధులు స్వాహా చేసినవారూ, సారా, బ్రాందీ వ్యాపారాల్లో భారీగా గడించిన వారూ; చట్టా వ్యాపారం (షేర్లు- రియల్ ఎస్టేట్స్) లో లోకుల్ని ముంచినవారూ; లాటరీలు నడిపినవారూ; స్మగ్లింగ్ కింగ్‌లూ.... ఇలాంటి రూపాలలో పోగుపడిన నడమంత్రపు సిరి "పెట్టుబడి"గా ప్రచార, ప్రసార సాధనాలైన సినిమా- పత్రికా రంగాలకు ప్రవహించింది. పరమ నీచమైన విలువలతో పోగుపడిన 'ధనం' మేలైన సాంస్కృతిక విలువలను ఎలా ఆవిష్కరించ గలుగుతుంది? ఈ 'ధనం' ప్రచార, ప్రసార సాధనాల ద్వారా ప్రేక్షకులనూ, పాఠకులనూ కొన్ని అంశాలలో కండిషన్ చేస్తున్న తీరును గమనిద్దాం.

1. హీరోలు, లేక మహా పురుషులెవరో పుట్టి, దేశాన్ని మరమత్తు చేయాలి. ప్రజలు ప్రేక్షకులు, లేక నిమిత్త మాత్రులు.
2. హింస, రౌడీయిజం, రక్తపాతం బీభత్సదాయకం. కనుక వాటికి బలికాకుండా తప్పించుకోవటమో, లొంగి బతకటమో తప్ప గత్యంతరం లేదు.
3. అవినీతి సర్వవ్యాపితం .... అందినంత పుచ్చుకో.... దొరక్కుండా తప్పించుకో.
4. రాజకీయం పరమ కిరాతకం. సాధ్యమయితే వినియోగించుకో లేకపోతే దానికి దూరంగా పారిపో.
5. మానవులు సెక్స్ జీవులు. వారు ఎల్లవేళలా సెక్స్ యావలోనే వుంటారు. డేటింగులూ, ఫ్రీ సెక్సులూ తప్ప లేదు.... వారి వారి చాపల్యాన్ని బట్టి, అవకాశాలను వినియోగించుకోవడమే!!
6. డబ్బు, అధికారానికి రౌడీయిజం, అవినీతి అత్యంత అవసరం.

ఈ రకపు ప్రజా వ్యతిరేక భావాలు చాలా సహజమైనవిగా ప్రజలు భావించి, స్వీకరించేట్టు ప్రభావితం చేస్తున్నారు. జీవితం అత్యంత దుర్మార్గంగా వున్నది కనుక, ప్రజలు దాని కనుగుణంగా బతకటం మాత్రమే నేర్చుకోవాలని చెబుతున్నాయి. ప్రజానుకూల మార్పనేది అసంభవమనే నిరాశావాదాన్ని బోధిస్తున్నాయి. ప్రజల సామూహిక కార్యాచరణ యొక్క సంక్లిష్టతల్ని అర్థం చేసుకోనివ్వకుండా, ప్రజా స్వామిక వ్యక్తిత్వపు విలువల్ని పెరగనివ్వకుండా మాత్రం చూస్తుంటాయి.

గిడసబారిపోయి, పచ్చి అభివృద్ధి నిరోధకంగా తయారయిన అర్ధ ఫ్యూడల్ వ్యవస్థా, దేశ సంపదల్నీ, మార్కెట్లనీ, శ్రమ శక్తిని జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్న సామ్రాజ్యవాదమూ సాధారణ ప్రజల జీవితాల్ని సంక్లిష్టంగానూ, నిత్య సంఘర్షణ మయంగానూ మార్చివేశాయి. దానితో పోటీ పెరిగిపోయి, మానవ సంబంధాలు కేవలం భౌతిక ప్రయోజనాలకే పరిమితం చేశాయి. నీళ్ళలో మునిగిపోతున్న బస్సు

కున్న ఒకే ఒక గేటు ద్వారా బయటపడటానికి అందులోని ప్రయాణీకులు ఎంత తాపత్రయ పడతారో, అమానుషంగా ప్రవర్తిస్తారో అలా ఈ నాటి జీవితం చావు బతుకుల సమస్యగా తయారయి, క్రూరమైన పోటీ తత్వానికీ, అమానవీయతకూ కారణమవుతోంది. "పోటీ పడకపోతే నశిస్తావు" అనే మనస్తత్వాన్ని భావజాల రంగం ద్వారా ప్రజల హృదయాంతరాళాల్లోకి ఎక్కించి, క్రీడా స్ఫూర్తితో కూడిన పోటీకి బదులు, జంతు తత్వంతో కూడిన పోటీ స్వభావాన్ని పెంచుతున్నారు. మానవజాతి ఇప్పటికే సాధించిన ఉత్తమ విలువలను దళారీ సంస్కృతి ధ్వంసం చేస్తోంది.

Metro or Mega City ల నిర్మాణం పేరుతో అపార్ట్‌మెంట్ కల్చర్ వ్యాప్తి చెందుతోంది ఇది సామూహిక జీవిత తత్వాన్ని ధ్వంసం చేస్తుంది. పక్కయింటి వారి కష్టనష్టాల గురించి, ఆనందోత్సాహాల గురించి ఆలోచన లేకుండా చేస్తోంది. కేవలం వైయ్యక్తిక ఆనందపు ఒంటరి తత్వంతో జీవించే అలవాటు పెరగటంవల్ల సామాజిక సంబంధాలు విచ్ఛిన్నమై పోతున్నాయి. అంతేకాక కుటుంబ సంబంధాలపై కూడా అది తీవ్రమైన ప్రభావాన్ని కలిగిస్తోంది. దీనివల్ల తక్షణంగా పాత (వృద్ధ) తరంవాళ్ళూ, ఒక మేరకు భవిష్యత్తరం (బిడ్డలు) వాళ్ళూ....ఇద్దరూ నష్టపోతున్నారు. తల్లిదండ్రుల గురించిన బాధ్యతా దెబ్బ తింటున్నవి. చివరికి తల్లిదండ్రుల ఆనందానికి బిడ్డలు అడ్డం వస్తున్నారనేది కూడా కొందరిలో క్రమేణా పెరిగి మూర్ఖులే జ్ఞానమనుకునే తప్పుడు భావం ప్రబలి చిన్న పిల్లల్ని కూడా రెసిడెన్షియల్ స్కూల్స్‌కి వదిలేస్తున్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్, ఓల్డు ఏజ్ హోమ్స్ రెండింటి స్వభావంలో వున్న సామ్యత ఏమంటే.... సారాంశంలో ఒకటి బోస్టన్ జైలుగా వుండగా. మరొకటి ప్రవాస జీవితంలా తయారయింది.

విపరీతమయిన వేగంతో కోర్కెలూ, అలవాట్లూ, అభిరుచులూ, సంబంధాలూ మారిపోయేట్టు చూడటం ద్వారా కొత్త వస్తువులకి మార్కెట్టుని పెంపొందించుకోవటం దోపిడీ వర్గాల ఆర్థిక ప్రయోజనమైతే, దాని యొక్క సాంస్కృతిక విలువ ఏమంటే నిలకడైన భావమూ, లేక బాధ్యతాయుతమైన ప్రవర్తనా అలవడకుండా చూడటం. తాత్వికంగా మార్క్సిజం కూడా పాతబడిపోయిందని ప్రచారం చేస్తూ, దాని కంటిపెట్టుకుని వుండటం "జడత్వం"గా, మారలేని తత్వంగా సాంస్కృతిక సామ్రాజ్యవాదం ప్రవచిస్తోంది. దీర్ఘకాలిక స్వభావం కలిగిన నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యానికి నిలకడగా కట్టుబడనివ్వకుండా ఈ తత్వం చూస్తుంది స్త్రీ పురుష సంబంధాల విషయంలో కూడా నిలకడతనం లేకుండా యిది చేస్తుంది.

మహిళలను అణచివేతకు గురి చేస్తున్న భూస్వామిక సంబంధాలు, పురుషాధిపత్యం, వస్తు వ్యామోహ తత్వం, అణచివేతలకూ, దాన్ని పెంచి పోషిస్తున్న రాజ్యం, దోపిడీ వ్యవస్థలకూ, వ్యతిరేకంగా సాగించే పోరాటంలో రూపొందే

వ్యక్తిత్వం కాకుండా- వైయక్తిక అభిరుచులూ, ప్రదర్శనాతత్వం (Exibitionism) పెంచబడుతున్నాయి. డేటింగులూ, ఫ్రీ సెక్సు ప్రోత్సహించ బడుతున్నది. భూస్వామ్య, పితృస్వామిక సంబంధాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక విలువలు రూపొందేట్టు కాకుండా అరాచక విచ్ఛిన్నవిధితనాన్నీ, బాధ్యతా రాహిత్యాన్నీ, పలాయన వాదాన్నీ, వ్యక్తి తత్వాన్నీ పెంచి పోషిస్తున్నది.

కుటుంబం పైన సామ్రాజ్యవాద సంస్కృతి ప్రభావం- సామ్రాజ్య వాదపు ఆర్థిక రాజకీయ విధానాలకు ప్రతిబింబంగానే వుంటున్నది. పాత విలువలను ధ్వంసం చేయటం నూతన ప్రజాస్వామిక విలువలు రూపొందకుండా చూడటం దాని విధానం. "స్వయం పోషక ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసి పారిశ్రామిక వ్యవసాయ రంగాలు సామ్రాజ్యవాదం మీద ఆధారపడేట్టు చేసినట్టుగానే- పాత కుటుంబ సంబంధాలను విచ్ఛిన్నం చేసి, సామ్రాజ్యవాద మార్కెట్ విలువలు, వస్తు వ్యామోహ, వైయక్తి కానందపు విలువలను పెంచుతోంది. భూస్వామ్య పితృస్వామిక విలువలకు సామ్రాజ్యవాద సంస్కృతి జత కలిసిన దాని యొక్క వికృత రూపం యిది.

ప్రైవేటితోపాటు నేరము, హింస, యుద్ధం వినోదభరితంగా సరికొత్త పోకడలతో తయారుచేసి వాటిలోని అమానుషత్వాన్ని, ప్రజా వ్యతిరేక స్వభావాన్ని. గుర్తించనివ్వకుండా చేస్తున్నారు.

ఉదా॥ అమెరికన్ సామ్రాజ్యవాదులు ఇరాక్‌పై చేసిన యుద్ధ సన్నివేశాలను 'మాయాబజార్' సినిమాలాగానో, మహాభారత్ టి.వి. సీరియల్ లాగానో C N N (Cable News Net Work) అనే సంస్థ ప్రసారం చేసింది. రోజువారీ వార్తల ద్వారా అందే ఎన్‌కౌంటర్ హత్యలూ, లాకప్ హింసలూ, వరకట్న హత్యలూ, దళితులపై దాడులూ, మహిళలపై అత్యాచారాలూ సర్వ సాధారణ విషయాలుగా రూపొందించి స్పందనలేని బండబారిన తత్వాన్ని అలవాటుగా చేస్తున్నారు.

తూర్పు యూరపు, రష్యాలలో దొంగ కమ్యూనిస్టుల ముసుగు చిరిగిపోతే అది 'సోషలిజం' వైఫల్యంగా చిత్రించి మానవజాతి ఈ శతాబ్దంలో సాధించిన అత్యుత్తమ సాంస్కృతిక విలువ అయిన "సోషలిజాన్ని" అత్యంత నీచంగా అవహేళన చేశారు. కొద్ది మంది బందిపోటు దొంగల్ని అత్యంత సంపన్నులుగానూ కోట్లాది శ్రమజీవుల్ని దిక్కుమాలిన వారిగానూ మార్చే పెట్టుబడిదారీ విధానం తప్ప మానవాళికి మరో గత్యంతరం లేదన్నట్టు చెవిసిల్లు కట్టుకుని పోరు పెట్టారు

ఒక్క మాటలో.... మానవీయ విలువలన్నీ పనికిమాలిన విషయాలుగా భావించేటట్లు చేస్తున్నారు. దళారీ పాలకులకూ భూస్వామ్య సామ్రాజ్యవాదులకూ ఇంతకంటె కావలసినదేముంది? దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడితే తప్ప జీవితంలో ప్రజాస్వామిక మార్పులు సాధ్యం కావని గ్రహించనీయకుండా, భావించ

నందా చేయగల్గటమంటే, దోపిడీ వర్గాలు యుద్ధం చేయకుండానే విజయం పొందు తున్నన్న మాట!

ఇప్పటికే పై రకాల భావజాలాల్ని రకరకాల స్టార్ టి.వి. ఛానెల్స్, జీ-టి.వీ, మెట్రో, DD ఛానల్స్ కాక స్థానిక కేబుల్ టి.వి. కార్యక్రమాలు, వి.సి.పీలు వి.సీఆర్లు, బ్లూ ఫిల్ములూ.... ఇలా ఎన్నో రకాల దృశ్య, శ్రవణ కార్యక్రమాలతో ప్రేక్షకులు ఉక్కిరి బిక్కిరై పోతున్నారు. సినిమా హాళ్ళ ద్వారా నేటి సినిమాలు పేద జనాలలో సీచాభిరుచుల్ని పెచ్చుగొల్పుతున్నాయి.

వార, మాసపత్రికలు, సినిమా, అశ్లీల పత్రికలు, సాహిత్యము కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. అర్జెంటుగా డబ్బులు సంపాదించుకోడానికి పతన సాంస్కృతిక విలువలు అద్భుత మార్గాలుగా ఉపయోగపడుతున్నాయి.

భగవద్గీత శ్లోకాలూ- సాయిబాబా సూక్తులూ- అన్నమాచార్య కీర్తనలకు, గీత గోవిందంకు కామసూత్ర చిత్రాలూ- చేతబడి- అతీత శక్తులు- సెక్స్ క్రైం సీరియల్స్- సరస లేక సెంటర్ సెన్సేషనల్ కథలు- బూతు జోకులూ- తేలిగ్గా డబ్బు సంపాదించే మార్గాలూ- అందానికి చిట్కాలు- స్త్రీల నగ్న ఫోటోలు, పోస్టర్లు సంభోగ చిత్రాలూ ఇలా భూస్వామ్య సామ్రాజ్యవాద కుళ్ళనూ, కంపునూ వార, మాస పత్రికలు మార్కెట్లోకి మోసుకు వస్తున్నాయి.

ఇప్పటికే సాంస్కృతిక వాతావరణం పతన విలువలతో ఉకలుకలాడుతూ వుంటే డంకెల్ ప్రతిపాదనలూ గాట్ ఒప్పందాల అమలులో భాగంగా ప్రచార, ప్రసార (పత్రికలు-టివీలు) రంగాల్లో బహుళజాతి సంస్థలకు సంపూర్ణ స్వేచ్ఛ నివ్వాల్సిన పరిస్థితి ఏర్పడబోతోంది. ఈ ఎలక్ట్రానిక్ దాడిని తిప్పి కొట్టకపోతే మినుకు మినుకు మంటున్న మానవీయ విలువలు కొండెక్కే ప్రమాదం వుంది. సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లి వారి షరతులకు ఆమోదం తెల్పటం, దాన్ని నిరసిస్తున్న ప్రజానీకాన్నీ ఉద్యమ కార్యకర్తలనూ నిర్బంధ చట్టాలతో క్రూరంగా అణచివెయ్యటమూ తప్ప మరేమీ చెయ్యలేని భారత దళారీ పాలకులు, తమ దోపిడీ విధానాలను మరింత బలోపేతం చేసుకోడానికి సాంస్కృతిక సామ్రాజ్యవాదానికి గేట్లు బార్లా తెరుస్తారన్నది స్పష్టమవుతోంది.

దళారీ పాలక వర్గాలు ప్రజల్ని భౌతికంగా, సాంస్కృతికంగా అణచి వుంచడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అది తాత్కాలికం మాత్రమే. సారా, దప్పికనూ; సినిమా, కడుపాకలనీ, తీర్చలేనట్లే భూస్వామ్య సామ్రాజ్యవాద సంస్కృతులు ప్రజాస్వామిక సంస్కృతినీ, జాతుల స్వతంత్ర వ్యక్తిత్వాన్నీ ఆకాంక్షలనూ, మానవీయ విలువలనూ అభివృద్ధి చేయవు. విశాల భారత ప్రజానీకం సంఘటితంగా, సామాజిక పోరాటాలతో పాటు నూతన ప్రజాస్వామిక సాంస్కృతిక విలువల కోసం కూడా పోరాడాల్సి వుంది. అది ఎంత సంక్లిష్ట మార్గాలను తీసుకున్నా తప్పనిసరి.

సామ్రాజ్యవాద సంస్కృతి రూపాలైన అందాల పోటీలు, రికార్డింగు డ్యాన్సు లకు, అశ్లీల చిత్రాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని పట్టణాల్లో ఇటీవల వ్యక్తమయిన నిరసనను ఈ సందర్భంగా పేర్కొనటం అసందర్భం కాదు.

హైదరాబాదు లాంటి పెద్ద సిటీల్లో నిలువరించలేక పోయినా విజయవాడ, ఒంగోలు, నిజామాబాదులాంటి పట్టణాల్లో అందాల పోటీలను వివిధ సాంస్కృతిక, మహిళా, విద్యార్థి సంఘాలు ఎదురించి నిలుపు చేయించ గలిగాయి. అలాగే సిల్క్‌స్మిత రికార్డింగు డ్యాన్సులను హైదరాబాదు, విజయవాడ, తెనాలి గుంటూరుల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కాకినాడ, రాజమండ్రి, కరీంనగరాల్లో ఆపగలిగారు. కృష్ణాజిల్లా నాగాయలంక గ్రామంలో భౌతిక ఘర్షణ జరిగిన తర్వాత గానీ సిల్కుస్మిత డ్యాన్సు కార్యక్రమం ఆగలేదు. విజయవాడ పట్టణంలో సుమారు 4-5 వేల మంది కళాశాల విద్యార్థినులు అశ్లీల చిత్రాలకు, వాల్ పోస్టర్లకు వ్యతిరేకంగా పెద్ద ఊరేగింపు జరిపారు గుంటూరు జిల్లా నర్సరావుపేటలో 'అశ్లీలతకు' వ్యతిరేకంగా గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళన సాగుతోంది. హైదరాబాదు ఫిలిం సెన్సారు ఆఫీసు ముందు ప్రముఖ రచయితలూ, సాంస్కృతిక సంస్థలూ ధర్నాలు నిర్వహించారు.

సామ్రాజ్యవాద సంస్కృతి దుష్ప్రభావం వల్ల పెరిగిపోతున్న వస్తు వ్యామోహ తత్వం, డబ్బు సంస్కృతినీ, వరకట్నాల్నీ, వరకట్న హత్యల్నీ ప్రోత్సహిస్తోంది. పురుషాధిపత్య భావజాలం దానికి పునాదిగా తోడ్పడుతోంది. వీటికి వ్యతిరేకంగా మహిళల నిరసన పెల్లుబుకుతోంది.

నేటి వ్యవస్థలో సంపదా, అధికారం దక్కే అవకాశం సామాజికంగా అభివృద్ధి చెందిన వర్గాలకూ, కులాలకు మాత్రమే కలిగేట్టుగా వుంది. ఇది వర్గ దోపిడీని తీవ్రతరం చేస్తోంది. సాంఘిక వ్యత్యాసాలను పెంచి కులోన్మాదానికి ఊతం యిస్తోంది. కుల వివక్షతకూ, పీడనకూ వ్యతిరేకంగా దళితులు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి వస్తున్నారు.

భారతదేశంలోని సమస్త జాతుల, తెగల ప్రజానీకాన్నీ సామ్రాజ్యవాదులు, బడా బూర్జువా భూస్వామ్య వర్గాలూ విచ్చల విడిగా దోచుకోవటమే కాకుండా వారి జాతీయ సంస్కృతినీ, భాషనూ, సామూహిక తత్వంతో కూడిన ఆచార వ్యవహారాలను- కలసి మెలసి జీవించటాన్నీ, యిచ్చి పుచ్చుకునే అలవాట్లనూ ధ్వంసం చేస్తున్నాయి. వీటికి వ్యతిరేకంగా తమ తమ స్థాయిల్లో విభిన్న జాతుల, గిరిజన తెగల పోరాటాలు అనేకం జరిగాయి. ఇంకా సాగుతున్నాయి.

సామ్రాజ్యవాదం భారత ఉపఖండంలో హిందూ ముస్లిం మతాల మధ్య కుట్ర పూరితమైన చిచ్చును పెట్టి- ప్రజల మధ్య సహజంగా లేని మత విద్వేషపు భావజాలాన్ని కృత్రిమంగా వ్యాప్తి చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే

సామ్రాజ్యవాదుల వందిమాగదులైన బడా బూర్జువా- భూస్వామ్య పాలకులు దేశాన్ని 1947లో విభజించారు. హిందూ- ముస్లిం మతోన్మాద తత్వాన్ని పెంచి పోషించి మైనారిటీ ప్రజలపై దాడులకు అత్యాచారాలకు పాల్పడేట్లు చేస్తున్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు తీవ్రంగా స్పందించాల్సిన ప్రతి మలుపు సమయంలోనూ మత కలహాలను పెంచుతున్నారు.

డంకెల్ ప్రతిపాదనల్నీ, సరళీకృత పారిశ్రామిక విధానాలను పెద్ద ఎత్తున భారత ప్రజలు ప్రతిఘటించాల్సిన సమయంలో వారు మత కలహాల మారణ హోమంలో చిక్కుకుపోయేట్లు చేశారు. బాబ్రీ మసీదు విధ్వంసాన్ని అందులో భాగంగా కూడా చూడాలి ఇది మైనారిటీలకు రక్షణలేని పరిస్థితిని కల్పిస్తుంది. మతోన్మాదానికి వ్యతిరేకంగా- లౌకిక జీవనంపై మైనారిటీలు సాగించే పోరాటాలు ఊపందుకుంటున్నాయి. ఈ పోరాటాలు నూతన సంస్కృతీ నిర్మాణానికి దోహదపడతాయి.

సంస్కృతి అనేది సామాజిక వ్యవస్థ యొక్క ప్రతిబింబంగా మాత్రమే కాక స్వంత ఉనికిని కూడా కలిగి వుండి సామాజిక మూలాలను కూడా ప్రభావితం చేస్తూ వుంటుంది. ఈనాటి అర్ధవలస- అర్ధ ఫ్యూడల్ వ్యవస్థలను కాపాడటానికి పెంచి పోషింపబడుతున్న దళారీ సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాల ద్వారా నూతన ప్రజాస్వామిక సంస్కృతి వ్యాప్తి చెందుతోంది. భూస్వామ్య- సామ్రాజ్యవాద దోపిడి పీడనలకు వ్యతిరేకంగా అశేష ప్రజానీకం తమ తమ స్థాయిల్లో పోరాడుతున్నారు. 'దున్నేవానికే భూమి' కీలక నినాదంగా, వ్యవసాయక విప్లవం యిరుసుగా గ్రామీణ పేద- మధ్యతరగతి రైతాంగం కార్మిక వర్గ నాయకత్వాన ఉద్యమిస్తున్నారు. గాట్ ఒప్పందానికి నిరసనగా దేశభక్త రైతాంగంతో పాటు కార్మిక, పెటీ బూర్జువా, దేశభక్త మేధావి వర్గాల నన్నిటినీ ఐక్యం చేసి ఆందోళన సాగిస్తున్నారు. సరళీకృత ఆర్థిక పారిశ్రామిక విధానాలకు, అక్రమ లాకౌట్లూ మూసివేతలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాల్లో ముందుకు వస్తున్నారు. మహిళలు, దళితులు, వివిధ జాతులు, తెగలు మరియు మైనారిటీలు వివిధ రూపాల్లో దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక దేశభక్తి జాతీయ సంస్కృతీ, భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక సంస్కృతీ, హిందూ మతోన్మాద వ్యతిరేక లౌకిక సంస్కృతీ- వెరసి నూతన ప్రజాస్వామిక సంస్కృతి- పై పోరాటాల నుండి రూపొంది వ్యాప్తి గాంచుతోంది.

వ్యక్తిగత ఆస్తులు లేని దోపిడీ పీడనలు- అసమానత్వాలు, వివక్షతలకు తావులేని సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి నూతన ప్రజాస్వామిక దశ వారధిలాగా నిలుస్తుంది. దళారీ సంస్కృతి యొక్క విభిన్న రూపాలతో ప్రజలు తలపడేట్టు చేసి దాన్ని ప్రతిఘటించి, ఓడించటం ప్రజా సాంస్కృతికోద్యమపు తక్షణ కర్తవ్యం.

బాల్యం చితికినప్పుడు

— పప్పుల రాజిరెడ్డి

ఓ "నానేటి బాలలే రేపటి పౌరులారా!"
పుట్టిందే శాపమై- జీవితం వధ్యశిల శిలువపై బాలక్రీస్తులై
మీ రక్తాన్ని మీ చెమటని- మీ లేలేత శరీరాల కాయకష్టాన్ని
అథం శుభం యెరుగని మీ అమాయకత్వాన్ని నిస్సిగ్గుగా దోచేస్తూ
మీ కలల అలల తలకాయల్ని తప్పదీస్తున్న యీ పాపిష్టి లోకం
క్షమార్హం కాదనే మాట మాత్రం నిస్సందేహంగా నిజం-నిజం
అపునూ తల్లిలేకో తండ్రిలేకో యే దిక్కూ లేకో ప్రేమకు దూరమై
విసిరేయబడ్డ నీ బాల్యపు బంతి ఎటు పోతుందో తెలియని స్థితిలో
పల్లెల్లోనో పట్నంలోనో బారుల్లోనో బంగ్లాల్లోనో కార్ఖానాల్లోనో కాంపౌండ్లలోనో
నలిగిన నీ చిట్టి చేతులు రబ్బరులా సాగుతూ- సువ్వాక యంత్రమై నిరంతరం
శ్రమిస్తున్నా- నీ కష్టం ఫలాలై పండుతున్నా- చాలీచాలని కూడుతో
నీ కడుపు నింపుకోతున్నా- కాసింత ప్రేమతో పలుకరించే వాడుంటాడా!
అరకొర డబ్బులతో నీ కష్టాలికి కొలత వేసి- బట్టకీ పొట్టకీ బతుకు ముడేసి
ఆర్జనే ధ్యేయమైన ఆ మనుషుల కళ్ళల్లో నిజంగా నిజంగా యీ
హృదయ విదారక హాహాకారాల పరంపరల చలన దృశ్యాలు చిక్కుకోవా?
పాలు కారాల్సిన బుగ్గలు గొర్లుకాస్తూ- బతుకు గొంగళి భుజానేసుకొని
చెట్టూ గుట్టతో స్నేహం చేస్తుంటాయి
బలపాలు పట్టాల్సిన చేతులు బరిగెపట్టి పశువులని కాస్తుంటాయి
బజార్లో పిట్టగూడు కట్టి ఆడుకోవాల్సిన మొలకలు
బతుకు యుద్ధంలో పోరాడుతుంటాయి
బాల్యం చితికినప్పుడు / నిరాశ పెరిగి నిస్పృహ విస్తారమైనప్పుడు
బతుకు కుమిలి జీవితం దుర్భరమైనప్పుడు
మనిషి గాయపడుతుంటాడు / మనిషి ప్రేమకోసం దేవులాడుతుంటాడు
గాయపడ్డ మనిషికి కాలుష్యం పడదు
గాయపడ్డ మనిషి కాలుష్య పరిస్థితుల విషగాలుల నిర్బంధాల
ఉక్కు సంకెళ్ళ మృత్యు వలయం నుంచి- విముక్తి కోరుతాడు
స్వచ్ఛమైన కొత్తగాలి కోసం వనాలు పెంచాల్సిన కొత్త యత్నానికి
అనివార్య అవసరమవుతాడు. / చెట్టూ గుట్టతో చెలిమి పెంచుకుంటాడు
వనాలు పెంచితేనే కదా మన ప్రాణవాయువు ఆయువు పోసుకునేది
వనాలు పెంచితేనే కదా పవనాల చూపుధారలో
బీటలు వారిన భూమి బతుకు వెల్లి విరిసేది.

ప్రజాసాహితి కి

మా శుభాకాంక్షలు

—డా॥ సి. వి. రామన్ విద్యా సంస్థలు

నెల్లూరు

పిల్లల ప్రపంచం



పిల్లలూ

ఈ నెల మీ కోసం 'జియో లక్ష్మణ్' అంకుల్ తన బాల్యం గురించి వివరించారు. ఆయన కథలూ, కవితలూ రాస్తున్నారు. అలాగే 'నక్షత్రం వేణుగోపాల్' అంకుల్ రాసిన 'చందమామ' నృత్య గీతం చూడండి. మీలో నృత్యం చేయటం వచ్చిన వారు ఆ గీతానికి తగిన విధంగా మీ స్కూల్‌లోగానీ, మరెక్కడయినా ప్రదర్శన ఇవ్వవచ్చు. ఆ నడుమ భూకంపం వచ్చింది కదా. అప్పుడు "లహరి" రాసిన కవిత ఈనెల ఇస్తున్నాం. తను హనుమాన్ జంక్షన్‌లో ప్రసన్న భారతి విద్యానికేతన్‌లో ఐదో తరగతి చదువుతోంది. తనింకా కవితలు రాస్తుంది. చిన్న కార్టూన్లు కూడ గీస్తుంది. చాలా బహుమతులు కూడా పొందింది. మీరు కూడా అలా 'పిల్లల ప్రపంచానికి' రాసి పంపండి. వచ్చేనెల ఓ 'చిత్రకారుడు' 'కవీ' అయిన అంకుల్ తన బాల్యం గురించి మీకు చెబుతారు.

ఈ సెలవుల్లో మంచి మంచి పుస్తకాలు చదివి ఉంటారనుకుంటున్నాను. తిరిగి బడులు తెరుస్తున్నారు. ఎవరయినా పరీక్షల్లో తప్పినా నిరాశ చెందనవసరం లేదు. మరింత పట్టుదలతో చదవండి. చదువుతో పాటు మీలోని శక్తుల్ని పదును పెట్టుకోండి.

ఉంటాను మరి
మీ మావయ్య.

నిర్వహణ : పి. చంద్రశేఖర్ ఆజాద్ APSTC Ltd.,
25-1-1- ఫతేబాద్, ఏలూరు - 534002

'లహరి' ఈ కవితకు పేరు పెట్టలేదు. అలానే ప్రచురిస్తున్నాం. ఈ సారి కవితకు పేరు పెడుతుంది. పెట్టాలని 'లహరి'కి సూచన.

భూమాతా నువ్వు గోమాత వంటారే
సహనానికి మారుపేరు వని అంటారే
అమ్మ ఒడి హాయిగా ఉంటుందని
అక్కడికే భయాలూ రావని

కథల్లో, పాటల్లో, ఆటల్లో, మాటల్లో విన్నానే
తన పిల్లల్ని తాను తినే పులిలాగా
తెల్లవారకముందే భూకంపం అనే పంజాతో
అన్ని వేల మంది బ్రతుకులు తెల్లార్చేవేం?
శత్రువుని సైతం ఎదురుగా ఎదుర్కొని
హతమార్చాలనే భారత నీతిని సైతం మరచి
నిదురోతున్న నీ పిల్లల్ని
నీవే కబళించటం న్యాయమా?
నీ ఆకలి ఇంకా తీరలేదా?
తీరితే ఆ గాండ్రింపులింకా ఎందుకు?
బ్రతికి ఉన్న కొద్ది జీవుల్ని కూడా
ఇంకా బతకనీయవా!
ఎక్కడైనా అక్కాచెల్లెళ్ళు మోసం చేయడం
అన్నా-తమ్ముళ్ళు మోసం చేయడం
స్నేహితులు మోసం చేయడం
చూశాంగానీ....
భూమాత వైన నీవే ఇలా చేస్తే
మా బ్రతుకులేం కావాలి?
మేం ఎవర్ని నమ్ముకోవాలి?

— లహరి,
ప్రసన్న భారతి విద్యానికేతన్
హనుమాన్ జంక్షన్

కుటుంబ జీవిత ప్రేమలు, క్రమశిక్షణల నుండి...

— జీయో లక్ష్మణ్

అబ్బ! ఎంత మంచి శీర్షిక!

చిన్నప్పటి అల్లరి గురించి రాయాలి. రాజుగాడి గురించి రాయాలి. కోటిగాడు చెట్టుమీద నుంచి కిందపడ్డ విషయం రాయాలి. ఉప్మాకర్ర మాస్టారు కొట్టిన దెబ్బల గురించి రాయాలి. మైదానం మీద ఆడుకొని చింతచెట్ల దగ్గర కర్రా బిళ్ళ గురించి రాయాలి. పద్మత్త హాతువు చిట్టి పాపని కుళాయి వేయటానికి పైపుల కోసం తవ్విన గోతిలో కోదండి తోసే సిన సంతోషం గురించి రాయాలి. ఆ తర్వాత అమ్మ కొట్టిన దెబ్బల గురించి నాన్న తిట్టిన తిట్ల గురించి మా బాగా రాయాలి. ఎంత సంతోషంగా ఉందో! రైలు పట్టాలమీద పెట్టిన పది పైసల నాణెం, బండి వెళ్ళిన తర్వాత చూస్తే

ఎంత సాగిందో! ఆ తర్వాత అది మెళ్ళో నల్ల తాడుకి వేసి కట్టుకున్నావు. దాని గురించీ రాయాలి.

అసలు విషయం చెప్పటం మరిచి పోయాను. మదరిండియా మా అమ్మమ్మ గురించి రాయాలి. ఆవిడ కడుపులో దూరిపోయి వెచ్చగా కథలు, కబుర్లు చెప్పుకున్న సంఘటనలు ఎన్నని రాయాలి. నా కోసం లాంతరు వెలిగించి రాత్రి పది గంటల వరకూ ఉండి, రైలు కూతని కొండ గుర్తుగా పెట్టుకుని నా మనవడు పెద్ద డాక్టరవ్వాలి అనుకునే ఆ మహా మనిషి గురించి హృదయాన్ని కలం చేసి రాయాలి.

నన్ను ఎప్పుడన్నా భయపెట్టే ఒకానొక పేరు మావయ్య. నాకు పిల్లనిచ్చి నా భయం పోగొట్టేడు. ఎక్కడ గంతు లేసినా, ఏ అల్లరి చేసినా అమ్మకి దొరికిన ఒకే ఒక సాధనం 'మావయ్యతో చెబుతాను'. నాన్న గురించి చెప్పనక్కరలేదు తల్లో నాలుక లేని మనిషి. చెవులు పట్టుకుని ఊగేవాళ్ళం. మంచితనం మమకారం ఆయన మారుపేరు. ఎప్పుడు తలుచుకున్నా, ఎదనిండా సంతోషం నింపే మనిషి నాన్న. ఆయన గురించి ఎంతయినా రాయాలి.

చాలా రాయాలి చిన్నప్పటి గురించి. స్థలం సరిపోదు. అమ్మ, మావయ్య పెట్టిన క్రమశిక్షణ, అమ్మమ్మ నాన్న అందించిన ప్రేమ సమపాళ్ళలో అందుకుని ఇప్పుడో స్థితిలో ఉన్నాను. అప్పుడప్పుడు అమ్మమ్మ గానీ, నాన్నగానీ 'మన కళ్ళముందరే పెద్దోడు ఎదిగి పోయాడు' అంటుంటే వెన్నెల్లో మంచం వేసుకుని పడుకొని నక్షత్రాలను పిలుస్తూ రవిశంకర్ సితార వింటున్నట్లుంటుంది.

బాలల నృత్య గీతం :

ఓ చందమామ - మా చందమామ

— నక్షత్రం వేణుగోపాల్

ఓ చందమామా-మా చందమామా-ఓ చందమామ
మా మనసుల దాగివున్న - మాటల్ని చెప్పుకోను
నింగిలోన నిన్ను చూసి - నీ పైపుకి కదిలినము ॥ఓ చందమామ॥
వెలుగూ చీకట్లనూ - ఒకేలా ఆదరించి
కష్టాలూ నష్టాలు - ఉండవెల్ల కాలమని
మానవులది ఒక్క జాతి - కలసి బ్రతకమన్నావు
కులము మతము పేరుమీద కుచ్చితాలు విలనంట ॥ఓ చందమామ॥
నీ సిరి వెన్నెలా - నీ నల్లటి చీకటా
మనుషులంతా ఒక్కటనీ - అందరికీ పంచినావు
ఒకడి బ్రతుకు పన్నీరు - ఇంకొకడికి కన్నీరా
పేద గొప్ప భేదమేమి - దీని నీతి సూత్రమేది ॥ఓ చందమామ॥

(తరువాయి 37వ పేజీలో)

గల్పిక :

గురు దక్షిణ

— కొల్లి సత్యనారాయణ

అదొక పల్లెటూరు. ప్రక్కనే పట్నం. ఆ పల్లెలో సూర్యం అనే బాలుడు ఉన్నాడు. ముగ్గురు అన్నదమ్ములు, ఒక చెల్లెలు. అన్నలు ఇద్దరూ పాలేర్లుగా పని చేస్తున్నారు. తల్లిదండ్రులు కూలి పనికి వెళ్తారు.

చదువుకోవాలన్న కోర్కె సూర్యానికి బలంగా ఉంది. నలుగురు పనిచేసినా కుటుంబ పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. సూర్యం కూడా పనికిపోతే రెండు బస్తాల గింజలు తెస్తాడు. పేన్నీళ్ళకు చన్నీళ్ళు తోడు అన్నట్టుగా సూర్యాన్ని గొడ్ల కాపరిగా పెట్టారు. సూర్యం కోర్కె కోర్కెగానే మిగిలిపోయింది. గొడ్ల కాపరి అయ్యాడు.

సూర్యం గొంతు శ్రావ్యంగా ఉంటుంది. పాటలు పాడటం అతనికి సరదా. ఎప్పుడూ లల్లాయి పదాలు పాడుతూ ఉంటాడు. మేపటానికి గొడ్లను తోలుకెళ్ళినా, పొలంలో చెట్టు కింద చేరి పాటలు పాడుతూ ఉంటాడు. సినిమా పాటలు పాడతాడు అందుకని "జూనియర్ ఘంటసాల" అని తోటి పిల్లలు అతనికి పేరు పెట్టారు.

సినిమాల్లోకి వెళ్ళాలంటే సంగీతం నేర్చుకోవాలని విన్నాడు. దానితో సంగీతం నేర్చుకోవాలన్న కోర్కె కలిగింది.

ఆ గ్రామంలో శాస్త్రిగారని సంగీతం పంతులు ఉన్నాడు. సంగీత ప్రియులంటే ఆయనకు ఎంతో అభిమానం. పిల్లలకు నిష్టగా సంగీతం నేర్పుతాడు. అయితే సదాచార సంపన్నుడు. మూఢాచారాలు, మూఢ నమ్మకాలు మెండుగా ఉన్నాయి.

సంగీతం నేర్చుకుందామని సూర్యం ఆ శాస్త్రి గారి వద్దకు వెళ్ళాడు. తన కోర్కె వెళ్ళబుచ్చాడు.

సంగీతం నేర్చుకోటానికి వచ్చాడని విని శాస్త్రిగారు ఎంతో సంతోషించాడు. మరొక శిష్యుడు లభించినందుకు ఆనందపడ్డాడు. సంగీతం నేర్పుతానన్నాడు. శిష్యుడుగా అనుసరించ వలసిన పద్ధతులు వివరించాడు.

చివరకు ఎవరబ్బాయివని అడిగాడు.

"రామిగాడి కొడుకునండి" చెప్పాడు సూర్యం. ఆ మాట వినగానే శాస్త్రిగారి మోములో సంతోషం అదృశ్యమైంది. వళ్ళంతా తేళ్ళు, జెర్రులు పాకినట్లయింది. నెమ్మదిగా సంబాళించుకొని, అదో రకంగా ముఖం పెట్టి,

"అబ్బాయి ! నీవు పంచముడివి. నీవు డబ్బయితే యిస్తావు. నీకు సంగీతం నేర్పి సరస్వతీదేవికి అపచారం చేయలేను. సంగీతం నేర్చుకోటానికి అంతస్థు ఉండాలి. సంస్కృతి ఉండాలి. ప్రతివాడూ సంగీతం నేర్చుకుంటానంటే ఎలా? ఏదో

ఒక పని చేసుకోవాలిగాని, నీకు సంగీతం ఎందుకు? పో! ఏదైనా పని నేర్చుకో" అని మందలించాడు శాస్త్రిగారు.

ఆ మాటలకు సూర్యం చిన్నబోయ్యాడు. కళ్ళు నీళ్ళే తక్కువ. చేతిలో వస్తువు జారిపడి పగిలిపోయినంత బాధపడ్డాడు. తలొంచుకొని వెళ్ళిపోయాడు.

అయితే కోర్కె చంపుకోలేదు. పైగా మరింత బలపడింది. పట్టుదల పెరిగింది. నేర్చుకు తీరతానని దీక్ష పట్టాడు. గొడ్లను కాస్తూ పాటలు పాడటం మానలేదు.

గ్రామంలో జరిగే సంగీత సభలకు, హరికథ భజనలకు, బుర్రకథలకు తప్పని సరిగా హాజరయ్యేవాడు. కొత్త బాణీలు నేర్చుకోసాగాడు. పల్లె పదాలు కంఠతా పట్టాడు.

ఇదిలా జరుగుతూ ఉండగా ఆ గ్రామంలో కొంత మంది యువకులు కొత్తగా యువజన సంఘం పెట్టారు. గ్రామంలో యువకులు జూదం, త్రాగుడు, వ్యభిచారం వంటి దురలవాట్లకు లోనై ఉన్నారు. అవి మాన్పించాలి. మానండి అంటే మానరు. వారి దృష్టి మరొక వైపు మళ్ళించాలి. ఆ ఆలోచనలతో రాత్రిబడి పెట్టారు. యువకులకు చదువు నేర్పటం ప్రారంభించారు. దానితో పాటు ఆటలు, పాటలు నేర్పసాగారు. మరుగున పడుతున్న జానపద కళలకు జీవం పోశారు. పోటీలు పెట్టి బహుమతులు పంచిపెట్టారు. యువకులు నెమ్మదిగా యువజన సంఘంలో చేరసాగారు.

సూర్యం కూడా ఆకర్షితుడయ్యాడు. సభ్యుడుగా చేరాడు. రాత్రి బడికి వెళ్ళి అక్షరాలు నేర్చుకోసాగాడు. దానితో పాటలు పాడటం ప్రారంభించాడు. కొత్త పాటలు నేర్చుకున్నాడు. లల్లాయి పదాల స్థానంలో జీవితం పాటలు నేర్చుకొన్నాడు. కోలాటం, భజనలలో ముందున్నాడు. లోకజ్ఞానం కూడా పెరిగింది. మంచి గాయకుడుగా పేరు తెచ్చుకున్నాడు.

(35 వ పేజీ తరువాయి)

గ్రహణాలకు గాలులకు - భయపడక నిల్చి నీవు
విపత్తులే తప్పవని - విపులంగా చూపినావు
చావు పుట్టుక మానవులకి - సహజమని చాటినావు
పర కట్నపు బలవంతపు - మరణాలకు అర్థమేమి ॥ఓ చందమామ॥
మాసానికి పక్షమే - మమ్మల్ని కలుస్తావు
మరురోజే జాలిలేక - మమ్మల్ని మరుస్తావు
మనుషులంతా ఒక్కటై - కలిసె వరకు నిదురబోము
మా సందేహము తొలగేవరకు - నిన్ను మేము వదలబోము ॥ఓ చందమామ॥

అయితే గొడ్లను కాయటం మానలేదు. ప్రవర్తనలో మార్పు వచ్చింది. చైతన్యం పెరిగింది. తల్లిదండ్రులు సంతోషించారు.

జిల్లా యువజన మహాసభలు ఆ గ్రామంలో పెట్టారు. ఆటలు, వైజ్ఞానిక పోటీలు ఏర్పాటు చేశారు.

వైజ్ఞానిక పోటీలలో సూర్యం ప్రథముడుగా వచ్చాడు. పలు బహుమతులు సంపాదించాడు. సూర్యాన్ని ఘనంగా సన్మానించారు.

ఆ సభకు శాస్త్రిగారు కూడా వచ్చారు. సూర్యం పాటలు విని ఆనందించాడు.

శాస్త్రిగారిని చూసి సూర్యం వచ్చి నమస్కరించాడు. ప్రథముడుగా వచ్చినందుకు అభినందించాడు.

"ఎవరి దగ్గర నేర్చుకున్నావు?" అని ప్రశ్నించాడు.

"ఏ గురువు దగ్గరా నేర్చుకోలేదండి, సంఘం వారు నేర్పారు. పరోక్షంగా మీరే గురువులు" అన్నాడు సూర్యం.

"మరి గురుదక్షిణో"

"ఏమి యివ్వమంటారు?"

"చూడబ్బాయి సంగీతం సరస్వతిదేవితో సమానం. ఆమెకు అపచారం చేయకూడదు. సంగీతాన్ని బజారుపాలు చేయకూడదు, దైవ ప్రార్థనకే ఉపయోగించాలి. ఇకముందు ఇటువంటి సభలలో పాడనని వాగ్దానం చెయ్యి. అదే నాకిచ్చే గురుదక్షిణ అన్నాడు శాస్త్రిగారు.

ఆలోచనలో పడ్డాడు సూర్యం. తికమక పడ్డాడు. తేరుకున్నాడు.

"చూడండి శాస్త్రిగారు ! సంగీతం నేర్చుకోటానికి పంచముడు పనికిరాడు. పంచముని గురుదక్షిణ కావాలి నేర్పకపోయినా, సంగీతానికి కుల మతాలతో ప్రమేయమెందుకండి? ప్రజల్ని విజ్ఞానవంతుల్ని చేయటానికి సంగీతం ఒక సాధనం. అదొక కళ. ప్రజల కోసం పాడవద్దంటున్నారు. ఇంతకంటే అన్యాయం, దుర్మార్గం మరొకటుందా? నేను నేర్చుకున్న ఈ కళ ప్రజలకోసం గాని, పండితుల కోసం కాదు. మానుకోమని కోరటం సరస్వతిదేవిని అవమానపరచటం. గురువు మెప్పు కోసం ప్రజల్ని విడిచిపెట్టను" అని సూర్యం నిబ్బరంగా చెప్పాడు. నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

చదవండి !

చదివించండి ! !

ప్రజా సాహితి

చందాలు కట్టించండి

గల్పిక :

రాకపోకలు

— బజరా

సియ్యమ్మ ఢిల్లీ ఫ్లయిట్ దిగి ఎప్పటిలాగే తన సింహాసనాన్ని నెత్తిమీదెట్టుకొని రాజధాని వీధుల గుండా నడవసాగాడు. అప్పుడు సింహాసనం భుజం మీదికి వంగి ఒక ప్రశ్న వేసింది.

"సియ్యమ్మా! నీ రాజనీతిని చూస్తుంటే నిన్నొక ప్రశ్న అడగాలని వుంది. మీ కాంగ్రెసు చాలా గొప్ప పార్టీ అని, అందులోని వారంతా సచ్ఛీలురని భుజాలెగరు వేస్తారే?! అలాంటి మీ పార్టీలోని రెడ్డి తెలుగుదేశంలో ఎందుకు చేరినట్టు? సంతృప్తి కరమైన సమాధానం తెలిసీ చెప్పకపోయావో నీ సియ్యమ్మ సీటు నీకు దక్కకుండా పోతుంది" అంది సింహాసనం.

"ఆ రెడ్డి మొదట్నుంచీ వొఠి అసంతృప్తివాది. అలాంటి వాళ్ళు పార్టీలో వుండడం పార్టీకే నష్టం. ఇది అసలు సంతృప్తికరమైన విషయం. అసలు ఇలా ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీలోకి దూకే ఎవరన్నా నాకసహ్యం. పార్టీ ఫిరాయింపు దార్లను దూరంగా వుంచాలి" కళ్ళద్దాలు కదుపుతూ చెప్పాడు సియ్యమ్మ.

"అసమ్మతివాదులున్నారని ఇంతదాక విన్నాను గానీ అసంతృప్తివాదులున్నారని ఇప్పుడే తెలిసింది. మరి ఇంతకూ అసంతృప్తి ఎందుకు పెరిగినట్టు?" సింహాసనం కూడా కొర్రు దిగ్గొట్టినట్టు కొచ్చను వేసాననుకుంది.

"వాటాలు కుదరక, అంటే పదవుల పంపకాల్లో తేడా పొడొచ్చి. అయినా ఎప్పుడు పడితే అప్పుడు పదవుల్ని సర్దుతూనే వున్నాం. లేనివారికి కౌన్సిలర్లు, బోర్డు డైరక్టర్లు, చైర్మన్లు.... ఇలా ఇస్తూనే వున్నా, ఓపిక లేక జంపు చేసి వుంటాడు" సియ్యమ్మ గొంతులో నిజాయితీ వుంది.

"సరి, సరే.... మరి పాత్రికేయుల్ని పిలుస్తున్నావట, ఎందుకు?" సింహాసనం మళ్ళీ అడిగింది.

"మా పార్టీలో యువత, మేధావి వర్గం చేరుతోంది" సియ్యమ్మ గొంతులో గర్వం వుంది.

"నిజమే?!" నమ్మలేనట్టు చూసింది సింహాసనం.

"తెలుగు యువత అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే-తెలుగుదేశం పార్టీ అయినేలే ఇద్దరూ మా పార్టీలో చేరారు. ఇది ఎంతో శుభ పరిణామం. ఇలాంటి వారికి మా పార్టీ తలుపులు ఎప్పుడూ తెరిచే వుంటాయి. రెడ్డిలాంటి పార్టీ ఫిరాయింపుదార్లు పోతేనే మంచిది" సియ్యమ్మ మైకు తీసుకోబోయాడు.

"అదేంటి? పార్టీ మారిన ఆ రెడ్డి, తెలుగు యువతాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముగ్గురూ ఫిరాయింపువాళ్లే కదా" సింహాసనం అర్థం కానట్టు అడిగింది. →

దూరపు కొండల్లో...

— సంపత్

తుఫాను రాత్రి
కల్లోల మేఘం లోంచి
పిడుగు పాటు
మెట్రో పట్నాలో
లాగే బండి నలిగి
'ఆకలి' మృతి
బీభత్స వర్షం
నావికుడితో బోటు
తీరం తప్పింది
హౌరాపై నుండి
కళ్ళు చీకటైపడ్డా
మోట బొక్కెన్లో
గగన హర్మ్యం
శ్రమను జుర్రుకొని
జీర్ణం అంటుంది
ఉద్విగ్న రాత్రి
గుడిసె ఉసిళ్ళని
కసురిస్తోంది
మెర్క్యూరీ లాంపు
కాలిపోను, ఓ చిమ్నీ
గాయం చేసింది
రక్తం ఇంకిన
అన్నల జాడ చూశా
నాతో రారండి
చావని చెద
భూమి పగుళ్ళ పక్క
నక్కి కూచుంది
హోషియార్....హో
సునహ్లా ప్రభాత్‌కో
హం అప్నాయెంగే

బాధ

— అగ్నిప్రియ

బాధని నేను గుండెల్లో
నిక్షిప్తం చేసుకోలేను
భావాన్ని సంక్షిప్తంగా
అక్షరాలలో కుప్తీకరించలేను
ఒక్క క్షణం ముందు మెరిసి
మాయమైయే మిణుగురు పురుగుని కాను నేను
తీవ్రాల బాధ / నా అంతరాలలోంచి
తన్నుకు ప్రవహిస్తే / ఆ ప్రవాహంలో
దొర్లిపోయిన అక్షరాలు / ఒక పేజీ కావచ్చు
లేదా / ఒక కావ్యం కావొచ్చు

→ సిమ్హ్యమ్మ నవ్వాడు.

ఆ నవ్వులో రాజనీతి వుంది. ఇంకేదో వుంది. అదేదో అర్థమయ్యాక సింహాసనం నెత్తి నుంచి దిగి ఎప్పటిలాగే సిమ్హ్యమ్మని మోయసాగింది.



రక్తం చిందించితే గాని ఆగని సిల్క్‌స్మిత అశ్లీల నృత్య ప్రదర్శన

దేశం కోసం, అన్యాయాన్ని, దోపిడీ దౌర్జన్యాలను వ్యతిరేకించడానికి రక్తం చిందించడం విన్నాం. కన్నాం. కానీ, నేటి పాలకుల పుణ్యమా అని ఒక అశ్లీలతా ధోరణిని వ్యతిరేకించడానికి కూడా రక్తాన్ని చిందించవలసి వచ్చింది. సిల్క్‌స్మిత ఏకార్థ పాటల, అర్ధనగ్న, ముప్పావు నగ్న నృత్య ప్రదర్శన ఆపించడానికి నాగాయలంకలో కార్యకర్తలు రక్తాన్ని చిందించవలసే వచ్చింది.

కృష్ణాజిల్లాలో ఒకానొక గ్రామం నాగాయలంక. సముద్రతీర ప్రాంతం కావడంతో రొయ్యలు తెచ్చిపెట్టిన నడమంత్రపుసిరితో, నాగాయలంకలోని కొందరు వ్యక్తులు ఇక్కడ ఎయిర్ పోర్టు కావాలని డిమాండ్ చేసినా ఆశ్చర్య పడనక్కర్లేదు. అటువంటి రొయ్యల మిగులు చూసి సిల్క్‌స్మిత అంగాంగ ప్రదర్శనలు, బూతు పాటల విన్యాసాలు చూపి కామోద్రేకంలో ముంచెత్తి ఒక్క గంటలోనే కొన్నివేల రూపాయలు కొల్లగొట్టవచ్చని ప్లాను వేసి, మార్చి 13న సిల్క్‌స్మిత ప్రదర్శన ఏర్పాటు చేసి, తద్వారా వచ్చే డబ్బుల్ని ఒక పేద సినీ డైరెక్టర్‌కి ఇవ్వాలనే "సదుద్దేశ్యం"తో స్థానిక స్పోర్ట్స్ & కల్చరల్ అసోసియేషన్ వారు (ఇది ఈ కార్యక్రమం కోసమే అప్పటికప్పుడు ఏర్పడిందని వేరే చెప్పనక్కరలేదు) ఏర్పాటు చేశారట.

ఆ కార్యక్రమానికి ముందుగానే ప్రగతిశీల మహిళా సంఘం, నవభారత యువజన సంఘం, చొరవ తీసుకుని అరుణోదయ, దళిత మహాసభ, CPM, అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం, తెలుగు మహిళ, ప్రజాశక్తి విద్యా సంఘం, జనవాదక్, ఐ.పి.యఫ్. తదితర సంఘాల్ని సమావేశ పర్చి "సిల్క్‌స్మిత కార్యక్రమాన్ని రద్దు చేయాలని, లేదా ఆపి తీరుతాం" అని ప్రకటించారు. 11న నిరసన ప్రదర్శన జరిగింది. పత్రికా ప్రకటనలు, కలెక్టర్, పోలీస్ అధికార్లకు మెమొరాండలు ఇచ్చారు.

ఈ సమావేశాల్లో, నిరసన ప్రదర్శనల్లో, ధర్నాల్లో అన్ని కులాలకు చెందిన ప్రజలు, ముఖ్యంగా మహిళలు పాల్గొన్నారు. కాని సిల్క్‌స్మిత కార్యక్రమ నిర్వా

హకులు "మేం కాపులం కదా.... అందుకని కొందరు కమ్మవారు మా కార్యక్రమాన్ని పాడు చేయాలని కుట్ర పన్నారు" అని ప్రచారం చేయడంతో, దానితో కొందరు సిల్కుస్మిత అశ్లీల ప్రదర్శనా పరిరక్షకులుగా తయారయ్యారు. చూశారా! ఒక సామ్రాజ్యవాద సంస్కృతిని స్టేజీ మీద ఆడించి జనం దగ్గర డబ్బులు కొల్లగొట్టి వారి మనస్సుల్ని కుళ్ళు సంస్కృతితో కుళ్ళ బొడవడాన్కి భూస్వామ్య సంస్కృతీ భావజాలమైన కులాన్ని ఎలా జోడించ చూశారో?

అయినప్పటికీ, కాపు కులానికి చెందిన మహిళలు, యువకులు కూడా కలిసి అశ్లీలతా ప్రతిఘటనా వేదికగా సిద్ధమై, కమ్మ కులానికి చెందిన సిల్కుస్మిత కార్యక్రమాన్ని ఆపడానికే సిద్ధమయ్యారు. అంటే ఇక్కడ 'మంచి, చెడులే ముఖ్యం గానీ, కులం ముఖ్యం గాదనీ, చెడు ఏ కులానికి చెందినా చెడే, మంచి ఏ కులానికి చెందినా మంచే, కులాన్ని బట్టి తారుమారు అవ్వవు' అని జనం నిరూపించారు.

అది ఏప్రిల్ 13వ తేదీ. టిక్కెట్లు కొన్న వాళ్ళు, అంట గట్టించుకున్న వాళ్ళు కులం పేరిట కైపెక్కిన కొందరు, ఇంకొందరు టిక్కెట్లు కొని ప్రజా సంఘాల వారి ప్రచారంతో వెళ్ళడాన్కి సిగ్గుపడి వేరే వాళ్ళకు ఇచ్చి వేయగా ఆ టిక్కెట్లు పట్టుకుని వచ్చిన వారు సిల్కుస్మిత కార్యక్రమానికి హాజరు అయ్యారు. POW (స్త్రీ విముక్తి) నాయకులు కా॥ విజయ, NYO నాయకులు తలశిల లీలా మనోహర్, చైతన్యలు, PDSU నాయకులు కా॥ శ్రీను, అశ్లీలతా ప్రతిఘటనా వేదిక రాష్ట్ర కన్వీనర్ శ్రీ ఈదర గోపీచంద్, అరుణోదయ కళాకారులు బందరు, దివి తాలూకాల గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు చేరుకున్నారు. నిరసన ప్రదర్శనలు, మెమొరాండాలకు డి.యస్.పి, యస్.పి, కలెక్టర్‌లు ఇచ్చిన వాగ్దానం అలాగే ఉండిపోయింది. కార్యక్రమం రద్దు కాలేదు. స్థానిక పోలీసులు జోక్యం చేసుకోక పోగా.... "మీరూ మీరూ తేల్చుకోండి" అనడంతో నిర్వాహకులు కొందరు కుర్రాళ్ళను "రెడీ" చేసుకున్నారు. "సిల్కుస్మిత కార్యక్రమాన్ని ఎలా ఆపుతారో చూస్తాం.... తలకాయలు లేచిపోతాయి" అని హెచ్చరికలు చేశారు. నాగాయలంక లోని ప్రజానీకం ఏం జరుగుతుందోనని ఆదుర్దాగా చూస్తూ రోడ్లపై నిలబడ్డారు. అశ్లీలతా ప్రతిఘటనా ఆందోళనకారులు ప్రోగ్రామ్ ఆపమని చెప్పడాన్కి పోలీసు స్టేషన్‌కు ఊరేగింపుగా వెళ్ళారు. స్టేషన్‌లో ఎవరూ లేకుండా పోయారు. అక్కడే ఉన్నా "నాకేం తెలియదు" అనే మాట మాత్రమే మాట్లాడే సెంట్రీ లాంటి కాని స్టేబుల్‌కి "మేం ప్రోగ్రామ్ ఆపడాన్కి వెళ్తున్నాం. అక్కడేమన్నా జరిగితే, అందుకు బాధ్యులు మీరే" అని చెప్పి, ఊరేగింపు సెంటర్‌కు కదిలింది. పోలీసులు,

సి.ఐ. గారు శాంతి భద్రతల్ని నాగాయలంక సందుల్లో కాపాడడానికి సెంటర్‌కు దూరంగా తిరుగుతున్నారు. "అశ్లీలతా ధోరణులు నశించాలి! సిల్కుస్మిత్ అశ్లీల నృత్య ప్రదర్శనల్ని ఆపివేయాలి!" అంటూ నినాదాల హోరు. ఇంతలో కొద్ది మంది ఆడవాళ్ళను ముందు పెట్టి, ఒక గుంపు 'సిల్కుస్మిత కార్యక్రమం జరపా' లని అరుస్తూ బయలుదేరింది. రెండు ఊరేగింపులూ ఎదురెదురుగా వచ్చాయి. మాటా మాటా పెరిగింది. తోపులాట మొదలైంది. పరిస్థితి ఉద్రిక్తంగా తయారైంది. ఆందోళనాకారులు రోడ్డుపై బైఠాయించారు. కొందరు వాగ్వివాదం, తోపులాటల్లో చొక్కాలు పుచ్చుకుంటున్నారు. లోపల వేదికపై సిల్కుస్మిత నృత్యానికి సిద్ధం అవుతోంది. బయట చేతులు కలిశాయి. చేతుల్లోని కర్రలు లేచాయి. ఇంతలో కొందరు కులం పేరిట పోగేయబడ్డ కుర్రవాళ్ళెక్కిన మినీలారీ వచ్చి, తమకు దారివ్వ మని కూర్చున్న వాళ్ళను లేవమంటూ గాండ్రిస్తున్నారు. కొందరు కర్రలతో మినీ లారీ లోంచి దూకి, కలబడుతున్నారు. వారిలో ఎంత మందికి కనబడే, కనబడని దెబ్బలు తగిలాయో గానీ.... ఆందోళనాకారుల్లో ఒకరికి తల పగిలి నెత్తురు కారింది. కొందరు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేసి, "నిర్వాహకుల్ని అరెస్టు చేస్తారా చేయరా?" అని డిమాండ్ చేశారు. దానితో తప్పనిసరై పోలీసులు కదిలి వెళ్ళి నిర్వాహకుల్ని అరెస్టు చేశారు. సిల్కుస్మితతో "ప్రోగ్రామ్‌కి పర్మిషన్ లేదు. ఇక్కడి ఆందోళనకారులు మీకేవన్నా ప్రమాదం తలపెడితే, మేం మిమ్మల్ని రక్షించగలిగే స్థితిలో లే"మని చెప్పారు. దానితో సిల్కుస్మిత మేకప్‌తోనే కారులో నిష్క్రమించక తప్పలేదు. "నా ప్రజాస్వామిక హక్కుని అడ్డుకుంటున్నారు", "ఆడదాన్నై పుట్టిన నా పుట్టుకే అశ్లీలం అయితే నా కార్యక్రమాన్ని అడ్డుకునే వాళ్ళ పుట్టుక కూడా అశ్లీలమే", "నా ప్రదర్శనల్లో అశ్లీలత లేదని మంగళగిరి కోర్టు తీర్పు ఇచ్చిం"దని సిల్కుస్మిత ఎన్ని ప్రకటనలు ఇచ్చినా, జనం ముందు, ప్రజాందోళన ముందు ప్రోగ్రామ్‌ను రద్దు చేసుకొని వెళ్ళక తప్పలేదు. "ప్రజల తీర్పు ఇదీ" అని నాగాయలంకలోని ఆందోళనకారులు ప్రకటించారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ, హైదరాబాద్‌లలో తీవ్ర నిరసనలు 'పోలీసు లాఠీ దెబ్బలు' అరెస్టుల మధ్య జరిపారు. తెనాలి, కాకినాడ, రాజమండ్రిలలో ఆందోళన సూచనలు చూసి రద్దు చేసేసుకున్నారు. నాగాయలంకలో కార్యక్రమాన్ని సిల్కుస్మిత అర్ధాంత రంగా ఆపేసుకుని తిరిగి వెళ్ళిపోవలసి వచ్చింది. సామ్రాజ్యవాద సంస్కృతిని ఎదు ర్కొనే తోవలో ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

— వెంకట్రావు

విజయవాడ

రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజి

బి.వి. సుబ్బయ్య

పేర్నమిట్ట (పోస్టు), సంతనూతలపాడు
(మండలం), ప్రకాశం జిల్లా

మా మార్గ దర్శక సూత్రము : ★ సమాజ శ్రేయస్సే వ్యక్తి శ్రేయస్సు

★ విద్యా లక్ష్యములు - విజ్ఞానము, మనోవికాసము

మా బోధనలో మూడు దశలు :

1. క్లాసు రూపులో సమగ్రమైన, పటిష్టమైన బోధన
2. పాఠ్య గ్రంథములోని ప్రతి అంశమును నిశితమైన పరిశీలనతో అధ్యయనము చేయుట.
3. పై రెండు దశలలో విశదమైన బోధన, అధ్యయనముల తరువాత ఈ దశలో విద్యార్థి ప్రశ్నలకు జవాబులు స్వయముగా వ్రాయును.

   ఇట్టి శిక్షణ పొందిన విద్యార్థి తన పాఠ్యాంశములలో ఎవరు ఏ ప్రశ్న యిచ్చినా అవలీలగా జవాబు వ్రాయగలడు. ఏ ప్రవేశ పరీక్షలోనైనా, ఏ పోటీ పరీక్షలోనైనా గెలుపుకు అవకాశము గల గట్టి అభ్యర్థిగా నుండును.

ఈ శిక్షణా విధానములో గల సుగుణములు :

1. విజ్ఞానము శాశ్వతమైన సొత్తుగా విద్యార్థికి లభించును.
2. ఆలోచనా శక్తి పెరుగును.
3. క్రమశిక్షణతో కష్టపడి పనిచేయు స్వభావము బలపడును.
4. ఎటువంటి క్లిష్ట సమస్యనైనా పరిష్కరించుకొని ముందుకు పోగల ధోరణి, ఆత్మ విశ్వాసము బలపడును.
5. కార్య సాధనకు అవసరమైన పట్టుదల పెరుగును.
6. ఇతరుల మీద ఆధారపడకుండా స్వశక్తి మీద ఆధారపడి కార్యమును సాధించు వ్యక్తిగా పెరుగును.

7. పఠనాశక్తి పెంపొందించి తన కవసరమైన ఏ రంగములోనైనా తన టెక్స్టు బుక్‌తోనే ఆగక, పలు విశిష్ఠ గ్రంథములను చదివి, వాటి సారాంశమును గ్రహించి, తన విజ్ఞానమును అపారముగా పెంచుకొనగలడు.

8. ఈ విధానములో శిక్షణ ఈనాడు విద్యారంగమును పీడించుచున్న కాపీ కొట్టుటను నిర్మూలించుటలో దోహదపడగలదు.

కనుక మా విద్యా సంస్థలో కాలేజి మరియు హైస్కూలు, రెండు విభాగములలోను బోధనకు ప్రాణము. స్వయముగా జవాబులు వ్రాయుట. కాని ఇప్పుడు ఉపాధ్యాయుడు తయారు చేసిన జవాబులను (మెటీరియల్) విద్యార్థి కంఠస్థము చేసి పరీక్షలలో వ్రాయుట విస్తృతముగా వాడుకలో నున్నది.
1. ఈ పద్ధతి విద్యార్థి అభివృద్ధికి అడ్డుకట్ట. 2. విద్యార్థికి చొరవకు ఏ మాత్రము ప్రాధాన్యత లేదు. 3. క్లిష్ట పరిస్థితులలో ముందుకు పోగల ఆత్మ విశ్వాసము పెరగదు. 4. ఇతరులపై ఆధారపడే తత్వము పెరుగుతుంది. 5. తనదిగా, మిగిలియుండునటువంటి స్పష్టమైన విజ్ఞానము లేదు. 6. 5 సం॥ నుండి 20వ సం॥ వరకు 15 సం॥లు వ్యయ ప్రయాసలకోర్చి విద్యాభ్యాసములో ఉండి చివరకు అయోమయ స్థితిని ఎదుర్కొంటున్నాడు.
కనుక ఈ విధానమునకు మా విద్యా సంస్థలోను, స్కూలులోను, కాలేజీలోను స్థానము లేదు.

ప్రత్యేక గమనిక :

మెడిసన్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు లక్షమంది దాకా వ్రాస్తే సీట్లు ఉన్నది రెండు వేల మందికే. మిగిలిన 98,000 మంది వెనుకకు తిరిగి వచ్చి మరొక జీవిత రంగములో ప్రవేశించాలి. సమగ్రమైన విద్య, సరియైన సాధనగల వాళ్ళే చొరవతో ఏదో ఒక రంగములో ముందుకు పోగలుగుతారు. ఈ ఒప్ప జెప్పే విద్యార్థులు ఇక్కడ కూడా స్వశక్తి, స్వంత ఆలోచనతో ముందుకు పోగల విద్యార్థి కంటే వెనుకబడతారు.

బి.వి. సుబ్బయ్య,
డైరెక్టర్

ఆణిముత్యం 'శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం,'

— ఛాయరాజ్

1959 నుండి 70 వరకు వివిధ దశలలో రెండు భౌగోళిక ప్రాంతాలలో శ్రీకాకుళం జిల్లాలో సాగిన గిరిజన- రైతాంగ ఉద్యమాన్నే శ్రీకాకుళ ఉద్యమం అని సాధారణంగా అందరూ భావిస్తారు. ఈ ఉద్యమ కాలంలోనూ ఆ తరువాత ఈ ఉద్యమ ప్రభావంతో ఈ ఉద్యమాన్ని గానం చేస్తూ వెలువడిన వివిధ సాహిత్య ప్రక్రియలన్నింటినీ కలిపి శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యమని చెప్పవచ్చును. వివిధ సాహిత్య ప్రక్రియలు అంటే కరపత్రాలు, డాక్యుమెంట్లు, ప్రసంగ పాఠాలలాంటివి కాక సృజనాత్మక సాహిత్యం కళారూపాలుగా అర్థం చేసుకోవాల్సి వుంటుంది. ఈ అర్థంలో ప్రస్తుతానికి, 1989లో జనసాహితి ప్రచురణగా వెలువడిన "శ్రీకాకుళం" ఉద్యమ కథా కావ్యం చివరిది. ఈ కావ్యం శ్రీకాకుళ గిరిజన- రైతాంగ పోరాటాన్ని కవితా ప్రక్రియలో మొదటి సారిగా సమీక్షించింది.

అయితే జనసాహితి ప్రచురణగా వెలువడిన "శ్రీకాకుళం" ఉద్యమ కథా కావ్యం గురించి ఈ పరిశోధకుడు పేర్కొనకపోవడం శోచనీయం. డా॥ ముత్యం "శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం" ఉద్యమ సాహిత్యాన్ని సమీక్షించిన తొలి గ్రంథమవుతుంది. శ్రీకాకుళ ఉద్యమం పైన ఉద్యమ సాహిత్యం పైన పరిశోధనకు చాలా మంది ప్రయత్నాలు చేసినట్టు పరిశోధన చేస్తున్నట్టు, తెలుస్తోంది గానీ డా॥ ముత్యం గ్రంథ మొక్కటే నేటికి వెలుగు చూసింది. సమకాలీన రాజకీయాలపై గతి తార్కిక అవగాహన, విప్లవ రాజకీయాల పట్ల నిబద్ధత లేకపోయినా, కనీసంగా సానుభూతి కలిగి వుండి; శ్రీకాకుళ భౌగోళిక సామాజిక శక్తులతో అంతో ఇంతో సన్నిహితత్వం కలిగి వుండేనే శ్రీకాకుళ ఉద్యమాన్ని యే రూపంలోనైనా సమీక్షించే సాహసం చేయగలరు. ప్రాముఖ్యత గల ఏ ఉద్యమానికైనా తప్పనట్టు.

శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమం కూడా రాజకీయంగాను సాహిత్య పరంగాను వివాదాస్పదమైనది. ఈ ఉద్యమ రాజకీయ సాహిత్య ప్రభావాలు భారత దేశంలో నేటికీ బలంగా వున్నాయి. వివాదాస్పద విషయాల శక్తివంతమైన సంఘర్షణ ఒక్కటే గుణాత్మక విప్లవ రాజకీయ సాంస్కృతిక ఫలితాలను భావి భారత ప్రజలకు అందిస్తుంది.

శ్రీకాకుళ ఉద్యమం ఊసెత్తితేనే అతడు విప్లవ రాజకీయాలలో ఏ దృక్పథం పైన నిబద్ధత కలిగి వున్నాడో తెలుసుకోడానికి ప్రయత్నిస్తారు. ఇది శ్రీకాకుళ ఉద్యమ రాజకీయ ప్రత్యేకత. అందుచేత డా॥ ముత్యం గ్రంథం అధ్యయనం చేసిన వారిలో కొందరు ఈ రచన పాక్షిక దృష్టితో వుందని అనడంలో వారి రాజకీయ దృక్పథమిచ్చిన దృష్టిని శంకించవలసిన అవసరం లేదు. శ్రీకాకుళ ఉద్యమంలో భిన్న రాజకీయ దృక్పథాలున్నాయి. అది భిన్న స్థాయిలలో నడిచి చివరకు చారు ముజుందార్ అతివాద దృక్పథంతో ఆ పర్టిక్యులర్ ఉద్యమం వస్తుగతంగా ముగిసింది. అంచాత డా॥ ముత్యం ఉద్యమ సాహిత్యాన్ని అది వెలువడిన సామాజిక పరిస్థితులతో సమన్వయించారు కాబట్టి రచన సమగ్రమా, పాక్షికమా అనే చర్చకు బదులు గ్రంథ రచయిత ప్రతిపాదనలోని నిజాయితీని ఏ దృక్కోణం నుంచైనా పరిశీలించ దగ్గదిగా వున్నాయా లేవా అన్నది ముఖ్యమైన అంశం.

శ్రీకాకుళం ఉద్యమం పైన ఏ రచనైనా సమగ్రంగా కనబడక పోవచ్చును. శ్రీకాకుళం ఉద్యమంలో భిన్న రాజకీయ దృక్పథాలుండడమే కాకుండా అవి ఆ ఉద్యమానంతరం ఆ ఉద్యమ ప్రేరణ తోనే కొనసాగుతున్నాయి. వివిధ విప్లవ రాజకీయ గ్రూపులన్నీ ఐక్యమై ఉద్యమాన్ని సమీక్షించే సమయంలో మాత్రమే ఆ ఉద్యమం పైన కనీసంగా విప్లవ రాజకీయ సమీక్ష వెలువడడానికి ఆస్కారముంటుంది. ఈ సమయం సందర్భం రాకుండా సర్వ సమగ్ర రచనను ఆశించడం సబబుగా వుండదు. అంత వరకు ఆ ఉద్యమం పైన వెలువడే గ్రంథాలను గ్రూపు రాజకీయాల ప్రమేయం లేని విప్లవ రాజకీయ నిబద్ధత, లేక సానుభూతితో పరిశీలించడం వల్ల ఆ రచన నుంచి ప్రయోజనాలను ఎవో వొక మేరకైనా పొందగలుగుతాం. ఉద్యమ సాహిత్యంపై ముత్యం చేసిన కృషి తెలుగు సాహిత్యంలో ప్రథమ ప్రయత్నం కాబట్టి ఆ కృషిని ఆప్యాయంగా ఆమోదించి అధ్యయనం చేసి భావి పరిశోధకులకు మార్గ దర్శకత్వం ఇవ్వగల సూచనలివ్వడం పాఠకుల కర్తవ్యంగా వుంటుంది.

శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యాన్ని సమీక్షించాలంటే ఉద్యమ సాహిత్య సమాచార మొక్కటే సరిపోదు, శ్రీకాకుళం జిల్లా పరిస్థితులను శ్రీకాకుళ రైతాంగ ఉద్యమ చరిత్రను అధ్యయనం చెయ్యాలి. రాజకీయ చరిత్రను అధ్యయనం చెయ్యాలి. ఈ పద్ధతి అనుసరించకుండా సాహిత్య వివేచన సాధ్యం కాదు. ఉద్యమ సాహిత్యం, అది వెలువడ్డ రాజకీయ, ఆర్థిక పరిస్థితులను చెప్పడంలో ముత్యం బేలన్సు తప్పకుండా వుండడానికి పడ్డ శ్రమ గ్రంథంలో స్పష్టంగా అవగతం అవుతుంది.

శ్రీకాకుళం జిల్లాలో 1834లో అచ్చిప వలస పితూరీ జరిగింది. గిరిజన తెగలకు చెందిన 'జమీందార్లు' బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా నడిపిన తిరుగుబాటు అది. డా॥ ముత్యం ఈ పితూరీ సంఘటనను ప్రస్తావిస్తూ 1959-70 లో జరిగిన శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమ పరిస్థితులను స్థూలంగా చెప్పారు.

అచ్చిప వలస పితూరీలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా జమిందార్ల ప్రయోజనాలకు అనుకూలంగా జరిగినట్టు పైకి కనిపించినా, దాని అంతస్సారం గిరిజనుల స్వతంత్ర జీవనాన్ని విచ్ఛిన్నం చేసి, వారిని కూలీలుగా మార్చే అంతర్జాతీయ మార్కెట్ శక్తుల (సామ్రాజ్యవాదుల)కు వ్యతిరేకంగా గిరిజన శక్తి ఉపయోగపడింది. కాని వాస్తవానికి శ్రీకాకుళ ఉద్యమం "స్వాతంత్ర్యం" అనంతరం భూస్వాములకు, గ్రామాధికారులకు, ఫారెస్టు అధికారులను గిరిజన కార్పొరేషన్‌కు వారిని కాపాడుతున్న పరిపాలకులకు వ్యతిరేకంగా గిరిజనులకు అనుకూలంగా జరిగింది.

శత్రువు యొక్క క్రూర హింసా కాండకూ, మిత్రుల యొక్క అతివాద పొరపాట్లకూ ఉద్యమం నలిగిపోయినా- దేశ వ్యాపితంగా గిరిజన రైతాంగం తమ అస్తిత్వం కోసం, అడవి పైనా, భూమిపైనా హక్కుల కోసం, స్వతంత్ర జీవనం కోసం భూస్వామ్య సామ్రాజ్యవాద దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరాటాల ప్రతీకగా శ్రీకాకుళం నిలిచిపోతుంది.

ముత్యం గారు శ్రీకాకుళ ఉద్యమాన్ని రెండు దశలలో గుర్తించారు. కొందరు 1959 నుండి 67 అక్టోబరు వరకు సాగిన ఉద్యమాన్ని నేటికీ గుర్తించ నిరాకరిస్తున్నారు. 1968-70 మధ్య కాలంలో జరిగిన ఉద్యమాన్నే శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటంగా ప్రకటిస్తున్నారు. విప్లవోద్యమాన్ని అధ్యయనం చెయ్యడానికి ఏ బాధ్యతా యుతమైన మేధావియైనా శ్రీకాకుళ ఉద్యమంలో 1959-67 వరకు సాగిన పోరాటాన్ని విస్మరించలేరు. డా॥ ముత్యం కీలకమైన ఈ దశను మొదటి అధ్యాయంలో శక్తి వంతంగా ప్రెజంటు చేశారు. గిరిజన రైతాంగం సాధించిన విజయాలు అత్యున్నతమైనవిగా తెలిపారు. సాహిత్య పరంగా "శ్రీకాకుళం" పదం విప్లవోద్యమానికి సంకేతమైంది.

మొత్తంగా శ్రీకాకుళ ఉద్యమాన్ని కాల విభజనతో కాక ప్రజా పంథా దృక్పధమూ, వ్యక్తిగత హింసా వాదమూగా సంకేతించి "మీదే శ్రీకాకుళం" అని జనసాహితి ఒకప్పుడు ప్రశ్నించింది. ఇంత స్పష్టంగా కాకుండా తనదైన పద్ధతిలో రెండు దశల శ్రీకాకుళ ఉద్యమాన్ని డా॥ ముత్యం గుర్తించి విశ్లేషించడంలో తన

సజాయితీని ప్రకటించారు. 1970-74 నిర్బంధ ఉద్యమదశ. శ్రీకాకుళ ఉద్యమంలో పై మూడు దశలుగా భావించి ముత్యం విశ్లేషించారు.

ఉద్యమ కాలంలో ఉద్యమ ప్రాంతాలలో గిరిజనులు, దళితులు, మహిళల వ్యక్తిగత సమస్యలను పట్టించుకొని వారి ఆచార వ్యవహారాలకు సంబంధించిన అనేక అంశాలలో మార్పులను కలగజేసే సాంస్కృతికోద్యమాన్ని విప్లవోద్యమానికి అనుసంధానించి కమ్యూనిస్టులు నడిపారు. పీడిత వర్గాల సాంస్కృతిక వ్యవహారాలను కమ్యూనిస్టులు అసలు పట్టించుకోలేదని విమర్శించే వారికి సమాధానం రెండవ అధ్యాయంలో కొంత వరకు దొరుకుతుంది. ఈ విషయమై స్పష్టత కోసం మరింత అధ్యయనం, పరిశోధన అవసరం. రెండవ అధ్యాయం చివర సాంస్కృతిక రంగం గురించి ముత్యం వెలిబుచ్చిన అభిప్రాయాలు గమనించ దగ్గవి. "గిరిజన సంస్కృతిలోని సంప్రదాయాలను స్వీకరించి తమ దృక్పథాని కనుగుణంగా మలచుకోవడం ఏజన్సీ గిరిజనోద్యమ మొదటి దశలో సాగింది" అంటారు ముత్యం. సత్యం ఇది. ఆ తరువాత దశలో మైదాన ప్రాంత జీవిత వాస్తవికతను చిత్రించే ప్రదర్శనలను ఏజన్సీలో ప్రదర్శించారు గాని గిరిజన సంస్కృతిలోని దృశ్య రూపాలను స్వీకరించి ప్రదర్శించ లేదని చెపుతూ అందుకు కారణం ఉద్యమ కార్యకర్తల కళాభిరుచులు, మధ్య తరగతి నాయకత్వం, ఉద్యమ నేపథ్యంగా వున్న లిఖిత సాహిత్య పునాది అనే మూడు అంశాలుగా పరిశీలించా లన్నారు. ఉద్యమ రెండవ దశకున్న ప్రత్యేకతలు కూడా పరిగణనలోనికి తీసుకోవాలి. ప్రజా సంఘాల ప్రాధాన్యతను నిరాకరించడం, శత్రు నిర్మూలన గెరిల్లా యుద్ధ పద్ధతి, ఉద్యమ ప్రాంతంతో కనీసం పరిచయం లేని కార్యకర్తలను రిక్రూట్ చేసి అతివాద పంథాలను అమలు పరచే తొందరపాటుతో కూడిన చర్యలు ఉద్యమాన్ని ఉక్కిరి బిక్కిరి చేసాయి. అంతే కాకుండా ఉద్యమం రెండవ దశ రెండేళ్ళ కాలం లోనే ముగిసింది. ప్రజల మధ్య పని చెయ్యడానికి, వారి నాయకత్వం అభివృద్ధికి, వారి సాంస్కృతిక విలువలను అభివృద్ధి చేసే దాని మార్గాను ఉద్యమ సాహితీ సాంస్కృతిక రూపాలుగా రూపొందించుకొని ప్రయత్నాన్ని అడుగు పరచే అవరోధాలు పాలకుల ప్రచార నిర్బంధమూ, నాయకత్వంపై ప్రభావితమైన అతివాద విప్లవ పంథాలో ఉన్నాయన్న అంశాన్ని పరిగణనలోనికి తీసుకొని పరిశీలించాల్సిన అవసరాన్ని డా॥ ముత్యం గుర్తించగలిగి వుంటే, తన పరిశీలనను మరింత సమగ్రంగా రూపొందించుకో గలిగి వుండేవారు.

శ్రీకాకుళ ఉద్యమం మొదటి దశలో వెలువడిన సాహిత్యాన్ని మూడవ అధ్యాయంలో సమగ్రంగా విశ్లేషించారు ముత్యం. ఈ దశలో వెలువడిన పాటలన్నీ ప్రజలను ప్రభావితం చేసి కార్యాచరణకు కదిలించాయి. ఈ సాహిత్యం "ఉద్యమం

నుండి ఉద్యమం కోసమే" వెలువడ్డాయి. ఈ అధ్యాయంలో ముత్యం కృషి అభినందనీయం.

సాయుధ పోరాట దశ (1968-70)లో సాహిత్యాన్ని నాల్గవ అధ్యాయంలో విశ్లేషించారు. ఉద్యమంలో పరిణామాలు వేగవంతమవడంతో నాయకత్వమే సాయుధ పోరాటంతో పాటు పాటను కూర్చి పాడుకొని భావ ప్రచారానికి వాడుకోవలసి వచ్చింది. నాయకత్వం నుండి ప్రజల మధ్యకు వెళుతున్న పాట తిరిగి నాయకత్వం దగ్గరకే పోయింది. విషయ వ్యక్తీకరణ క్రమం లేకుండా పాట కవితగా, గేయంగా పద్యంగా రకరకాల నిర్మాణాలు కలిసి రూపాన్ని కోల్పోయింది. ఈ ఉద్యమ కాలంలో వెలువడిన సాహిత్యంలో వస్తువు గురించి, పదజాలం గురించి, దృక్పథం గురించి, కవితా భాషల గురించి ప్రత్యేకంగా వెంపటాపు, పాణిగ్రాహిల పాటల ప్రత్యేకతల గురించి విపులంగానే చర్చించారు డా॥ ముత్యం గారు. "ఉద్యమం ఉన్నత స్థాయిలో సాగుతున్నపుడు పరిణామాలు వేగవంతమైనపుడు నిలకడ లేకుండా రాజ్యానికి ప్రజలకు యుద్ధం సాగుతున్నపుడు ప్రజలు, కార్యకర్తలు రాసే పాటలు నిర్మాణ బలహీనంగా ఉంటుందని సాధారణీకరణం చేయవచ్చు. అలాగే సాహిత్య రచనకు విరామం అవసరమని ఈ సందర్భంగా రుజువు అవుతుంది కూడా" అంటున్న ముత్యం గారి సూత్రీకరణలతో అందరూ ఏకీభవించ లేకపోవచ్చు.

నిర్బంధ దశ (1970-74)లో జైళ్ళ నుండి సమష్టిగా వెలువడిన పాటలు, బయట నుండి వెంపటాపు సత్యం, పాణిగ్రాహి రాసిన పాటలు నిర్బంధ వ్యతిరేకత ముఖ్య లక్షణంగా వుంటాయి. అమరులను కీర్తించడం, ప్రత్యామ్నాయ రాజకీయ పంథాలను చిత్రించడం, పాలక వర్గాల పట్ల నిరసనతో కూడుకున్న పాటలు చాలా శక్తివంతంగా వచ్చాయి. వర్గ శత్రు సంహారాన్ని ప్రోత్సహించుతూ రాసిన పాటలు కూడా వచ్చాయి. ఈ సందర్భంలో వచ్చిన పాటలు "1. శ్రీ కాకుళంలోన చిందిన నెత్తురు/ కాల్వలై ప్రవహించె కొండవాగులలోన/ కొండ లెరుపెక్కినాయీ పోరాడ/ బండలే కదలినాయి. 2. ఈ విప్లవాగ్ని లెచటవని అడిగితే/ శ్రీకాకుళం వైపు వేలు చూపించాలి. 3. శ్రీకాకుళం రా/ వీర శ్రీకాకుళంరా" ప్రఖ్యాతి చెందినవి. తెలుగు విప్లవ సాహిత్యంలో ఆణిముత్యాలు. ఈ పాటలలో కవుల సృజనాత్మకత కొత్త పుంతలు తొక్కింది. ఈ విషయాలను ప్రెజెంటు చేయడంలో ముత్యం అత్యంత ప్రతిభను ప్రదర్శించారనడానికి సందేహించ నవసరం లేదు.

శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యంలో పాట ప్రముఖ పాత్ర నిర్వహించింది. పాట ప్రాముఖ్యాన్ని బుర్రకథ, జముకుల కథ వంటి ప్రజా కళా రూపాల గురించి సవివరంగా వివరించారు ముత్యం గారు. గున్నమ్మ గురించిన దాసరుల పాటల దగ్గర నుండి శ్రీకాకుళ ఉద్యమంలో వెలువడిన పాటలను- అముద్రిత పాటలతో సహా- పరిగణలోనికి తీసుకొని విశ్లేషించి, వాటి బలాన్నీ, బలహీనతలను ఎత్తి

చూపుతూ సమర్థవంతంగా చెప్పిన ముత్యం గారిని అభినందించకుండా వుండలేం. "శ్రీకాకుళోద్యమ సాహిత్య స్వభావం- ఫలితం" అనే శీర్షికలో గ్రంథం చివర ముత్యం గారు వెలిబుచ్చిన అభిప్రాయాలు ముస్ముందు ఉద్యమ సాహిత్యాభివృద్ధికి జరిగే కృషికి బాగా తోడ్పడతాయని విశ్వసించ వచ్చును. ముత్యం గారి అభిప్రాయాల విశిష్టతను ఆయన మాటలతోనే ఈ సమీక్షా వ్యాసంలో చెప్పడం భావ్యంగా వుండదు. గ్రంథాన్ని చదివి గ్రహించాల్సి వుంటుంది.

నక్సల్‌బరీ పోరాటానికి కొనసాగింపుగా శ్రీకాకుళ ఉద్యమం, సాయుధ రూపాన్ని తీసుకుంది. గతంలో తెలంగాణా పోరాట విరమణతో నిర్జీవమైన విప్లవ, సాహితీ సాంస్కృతిక శక్తులను ఇవి తిరిగి తట్టి లేపాయి. ఉద్యమం అపారమైన నష్టాలకి గురైనా, అది విప్లవ సిద్ధాంత చర్చకు ద్వారాలు తెరిచింది. వీటి ప్రభావంతో దేశ వ్యాపితంగానూ, ప్రత్యేకించి ఆంధ్ర దేశంలో విప్లవ కెరటాలు అలలు అలలుగా లేచాయి. అనేక కారణాల వల్ల ఉద్యమాలు పీలికలై చీలాయి. అంతకంటె ఎక్కువ నిర్బంధాలను, నష్టాలను చవిచూస్తున్నాయి. ఐక్యతా ఆకాంక్షలు ప్రబలి నూతన ఉత్సాహాన్నిస్తున్నాయి. అయినా విశాల ప్రజానీకానికి చేరువ కావాల్సిన పరిస్థితే యిప్పటికీ వుంది. ఈ పరిస్థితి ఎందుకు నెలకొని వుందో పరిశీలించుకోవాల్సిన బాధ్యత ప్రజలకు బాధ్యత వహిస్తున్నాయని చెబుతున్న విప్లవ గ్రూపులనూ, పార్టీలకు వుంటుంది.

శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం - విప్లవ సాహితీ సాంస్కృతికోద్యమాలకు నూతన జన సత్యాలను అందించింది. భారత మేధావి వర్గాన్ని, రచయితలను, కళాకారులను మేల్కొలిపి గొప్ప ప్రభావానికి గురి చేసింది. ఈ పాజిటివ్ అంశాన్ని అభివృద్ధి చేసుకోవలసిన బాధ్యత మేధావి వర్గంపైనా, రచయితలు, కవులు, కళాకారులపైన వుంటుంది. విప్లవ రాజకీయాలకు విప్లవ సాహిత్యానికి అవినాభావ సంబంధముండి ఒకదానిపై ఒకటి ప్రభావాన్ని చూపుతాయన్న సత్యాన్ని గుర్తించుకొన్నవుడు మేధావి వర్గాల బాధ్యత ఎంత జటిలమైనదైనా ప్రాముఖ్యత గలదిగా గుర్తింప గలగాలి. మేధస్సులోని స్వీయాత్మకతను పారద్రోలాలి. అపోహలకు, మొహమాటాలకు తావివ్వని చర్చ జరపాలి. సూచనలివ్వ గలగాలి. తప్పొప్పులను నిజాయితీతో ఎత్తి చూపుతూ సమైక్య విప్లవోద్యమ నిర్మాణం జరగడానికి భూమికను ఏర్పాటు చేసే బాధ్యత, నిబద్ధత మేధావి వర్గాలు కూడా స్వీకరించాలి. "వేచి చూడాల్సిన" సమయం కాదిది.

ఈ నేపథ్యంలో డా॥ ముత్యం పరిశోధక గ్రంథం "శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం" చదివి, చర్చించి, పాఠాలు తీయడం తక్షణావసరం.

ప్రచురణ : మైత్రీ బుక్ హౌస్, విజయవాడ   వెల : రూ. 40-00

దృష్టి ప్రచురణ, హైదరాబాద్.

(8 వ పేజీ తరువాయి)

కమల : వుండు బాలా. నీకు మాత్రం అనిపించదా అయ్యగారు కొట్టినప్పుడు చంపాలని. పోనీ, అంతకోపం నీ మొహంలోనే కనబడుతుంది.

బాలా : ఏమిటి అమ్మాయి గారూ వేళాకోళం!

కమల : మా బాలా వస్తాడేం?

వీరయ్య : ఆ.

కమల : మీ సంఘంలో చేరాడా?

బాలా : నేనా చేరేది!

వీరయ్య : ఇంటి కుక్కవి. నువ్వెందుకు చేరతావు?

బాలా : అమ్మాయి గారూ! చూడండి మరి. ఇంక....

కమల : వీరయ్యా! బాలూకి కోపం తెప్పించకు. మళ్ళీ పోలీసుల్ని పిలవడు

వీరయ్య : అదేమిటి? పిలవం అన్నారుగా.

కమల : మరి బాలూకి కోపం తెప్పించకు. తెప్పించావంటే నీ రక్షణకి పోలీసుల్ని పిలవాల్సి వొస్తుంది. బాలూకి లాభాలు ఎట్లా పంచడం?

వీరయ్య : మా అందరికీ పంచినట్టే. కాని మా ఫాక్టరీ లాభాలలో భాగం వీల్లేదు.

కమల : మరి ఎట్లా?

వీరయ్య : మీవంతు లాభాల్లో....

కమల : అసలే మాకు ఒక్క భాగమే కదా?

వీరయ్య : వంటవాడెందుకు? మానెయ్యండి.

రాజారావు : మానేస్తే, ఏం చేస్తాడు బాలూ!

వీరయ్య : ఫాక్టరీలో పని చేస్తాడు.

రాజారావు : బాలూకి ఆకలి. అందుకనే వంట నేర్చుకున్నాడు.

వీరయ్య : ఏం లాభం ఆకలై? అందరూ పొట్టల్నిండా తిన్నదాకా.........

కమల : అట్లానే వుంటాయి మీ వూహాలూ, మీ కథకుల వర్ణనలూ. మా అందరికన్న ముందే తింటాడు బాలా. వొండడం తోనే తింటాడు రుచైనవన్నీ!

బాలా : ఏమిటి అమ్మాయిగారూ మరీని!

రాజారావు : ఇంతవరకు కోడికూరలో కార్జం మేమెవరం తినలేదు. బాలా వొండిన కోళ్ళకి గుండెలూ, కార్జాలూ వుండవు. అవి లేకుండానే బతుకుతాయి అవి.

బాలా : వీరయ్యగారు చెయ్యి చేసుకుంటారు గావును. నీళ్ళు తీసుకొస్తాను.

కమల : కడుక్కోరు. శుభ్రం ధనిక వర్గాల పద్ధతి. అవునా వీరయ్యా!

వీరయ్య : ఏమీ కాదు. బీదరికమే మురికికి కారణం.

కమల : ఏమోలే. బాగా శుభ్రంగా వుండాలంటే కొంత డబ్బు కావాలి. సీళ్ళు తీసుకురా బాలూ.

(బాలూ వెళ్ళాడు)

రాజారావు : మా నాన్నగారిని చంపితే మీ ఉపాధులు పోతాయి కదూ! నిన్ను ఉరి తియ్యవచ్చు.

వీరయ్య : పోతేనేం! ఉరి తీస్తేనేం? అందుకా నేను కసి పట్టింది.

రాజారావు : ఎందుకు మరి?

వీరయ్య : నేను చెప్పను.

కమల : పోనీలే. కాని అసలు ధనికుల్ని నాశనం చెయ్యాలనేగా మీ ఉద్దేశ్యం.

వీరయ్య : చంపి కాదు, నా మతం.

కమల : ఏదో విధంగా, వీలైతే న్యాయచట్టం ప్రకారం, కాకపోతే దౌర్జన్యంతో, ఔనా?

వీరయ్య : మీకేం తెలుసు?

కమల : నీ కన్న ఎక్కువ తెలుసు. నేను కమ్యూనిస్టుని. అపారంగా చదివాను ఆ వాఙ్మయాన్ని. పదిమంది ధనికుల్ని నాశనం చెయ్యాలంటే ముందు మీరు వెయ్యి మంది నాశన మౌతారు కద!

వీరయ్య : కానీ త్యాగం.

రాజారావు : ఎవరికోసం?

(బాలు సీళ్ళు తెచ్చాడు. వీరయ్య కడుక్కుంటున్నాడు)

వీరయ్య : ముందు వారికోసం.

కమల : మరి చచ్చిన వారికోసమో, మనం ఎగిరివున్న బతికి వున్న వారికోసం కన్న. ఎన్నడూ చూడని, తెలీని, ఇంకా పుట్టని, పెరగని మనుషుల మీద మీకంత ప్రేమ ఏమిటి?

వీరయ్య : మరి ఎన్నటికి ఇంక మోక్షం?

కమల : ఎవరికి!

వీరయ్య : కార్మికులకి.

కమల : ఏ కార్మికులకి? ఈ నాటివారికి కాదుకద!

(తండ్రి శోభనాచలపతి వొచ్చాడు.)

శోభనాచలపతి : ఏమిటి? ఇంకా పడుకోలేదూ? ఈ అతిథి ఎవరు? వీరయ్యా

రాజారావు : జాగర్త నాన్నా, నిన్ను చంపడానికి వొచ్చాడు. ఆ కత్తి చూడు

శోభనాచలపతి : ఎందుకు వీరయ్యా నన్ను చంపడం?

(కోటు అదీ తీసేస్తూ తిరుగుతున్నాడు. కొంచెం tipsyగా వున్నాడు.)

వీరయ్య : ఇంతమందిలో చెప్పటానికి వీల్లేదు.

శోభనాచలపతి : మనవాళ్ళే. ఫరవాలేదు కానీ.

వీరయ్య : (కత్తి తీసుకుని దూకుడుగా) సత్యభామని ఏం చేశావు? దాని మానాన్ని పాడు చేసిన హంతకుణ్ణి....

బాలూ : ఆగు. ఆగు.

శోభనాచలపతి : నీకేం సంబంధం?

వీరయ్య : నా చెల్లెలు.

శోభనాచలపతి : నీ చెల్లెలా! అందుకునే అంత ఆకర్షణ ఆ పిల్లలో.

వీరయ్య : (కమలతో) తెలిసిందా ఇప్పుడు?

కమల : ఇప్పుడు తెలీడమేమిటి? నాన్నకి అదే పని.

శోభనాచలపతి : నీతో చెప్పకుందా!

వీరయ్య : లేదు. నాకు తెలిసింది.

కమల : అయినా ఇన్నేళ్ళమట్టీ, ఎవరి మానమో ఒకరిది తీసేసే మా నాన్న మీద ఈనాడు ఈ పగ ఎందుకు? ఇదివరకంతా ఏం కోపం రాలేదే? నీ చెల్లెలు గనుక....

వీరయ్య : అవునూ....

కమల : ఏదో ముందు యుగాలవాళ్ళ మీద ప్రేమ అన్నావుగా. నీ ప్రేమంతా నీ చెల్లెలు మీదనే నన్నమాట.

వీరయ్య : ఇంతమంది కలిసి నా మీదికి రావడం అధర్మ వాదన.

కమల : ఇంకా ధర్మం, అధర్మం, ఇట్లాంటి మాటలు వున్నాయన్నమాట. మా డబ్బు పంచుకోవడం ధర్మమా, మీ పిల్లల్ని పంచుకోవడం అధర్మమూనా? వెయ్యి మంది బీదలు పదిమంది ధనికుల మీద పడడం ధర్మ యుద్ధమేనా?

శోభనాచలపతి : ఇంతకీ సత్యభామకి చాలా ఇష్టమేనే! నీకేం?

వీరయ్య : అది పుత్తి తప్పుడు ముండ. డబ్బుకి ఆశించింది.

కమల : ధనికుల నించి డబ్బు లాగింది ఆమె. మీరు అంగీకరించే పనేగా అది! మీరు దౌర్జన్యంతో లాగితే, ఆమె ప్రేమతో లాగింది.

శోభనాచలపతి : ధనికుడి కౌగిలిలోకి రావడమే ఆమె చేసిన తప్పనీ! కార్మికుల్లో రోజూ జరుగుతున్నదేగా? నిజం చెప్పుతున్నా, డబ్బు ఆశ పెట్టలేదు నేను.

వీరయ్య : ఆ చీరెలూ, ఉంగరం....

శోభనాచలపతి : నేను అవి యివ్వకుండా వుంటే, నీకింత బాధ వుండేది కాదా!

వీరయ్య : మీ ఆడవాళ్ళు లేరూ కులుకుతో కార్లలో తిరిగే వారు? మాజోలి మీ కెందుకు?

కమల : షోకుగల ఆడవాళ్ళని చూస్తే నాన్నాకి అసహ్యం. నాకూ అంతే. పెళ్ళి చేసుకుంటే నేను ఓ కార్మికుణ్నే చేసుకుంటాను. నీకు పెళ్ళి అయిందా వీరయ్యా

వీరయ్య : మీకెందుకు ఆ సంగతి!

కమల : నాకే ప్రేమ వొస్తే, అతనికి పెళ్ళయినా అభ్యంతరం లేదు నాకు.

వీరయ్య : ఈ అవినీతి అంతా ధనిక వర్గానిది.

కమల : అవును, కార్మికుల మనసులు చాలా శుభ్రం. ఇట్లాంటి వ్యవహారాలు అంత పట్టింపులు లేవు. నీ కోపమంతా ధనిక వర్గం మీద, అవినీతి మీద కాదు

వీరయ్య : అవినీతి వీల్లేదు.

రాజారావు : వీల్లేకుండా ఏం చేస్తావు?

బాలూ : అర్ధరాత్రి కత్తి పట్టుకుని కిటికీలోంచి దూకుతాడు.

వీరయ్య : ముందు కాలపు సాంఘిక నిర్మాణంలో అవినీతిని వొప్పుకోం.

శోభనాచలపతి : అవినీతి చాలా ఆనాదిది. ఏం చేస్తావు?

వీరయ్య : షూట్ చేస్తాం!

కమల : ఇంక వ్యక్తి స్వాతంత్ర్యం?

వీరయ్య : అట్లాంటిది వీల్లేదు.

కమల : స్వతంత్రం అంటే ఆర్థికమేనన్న మాట! అది మాత్రం ఏముందిలే చచ్చేటట్లు పని చేస్తేనేగాని అదీ లేదు.

వీరయ్య : అవును. మీ నాన్నలాంటి సోమరుల్ని సహించం.

రాజారావు : అన్యాయం కాదూ! నాన్న ఎంత కష్టపడి పనిచేస్తారు ఫాక్టరీ కోసం! నీకన్న గంటలు ఎక్కువ!

వీరయ్య : ఏం? హాయిగా పంకాల కింద....

రాజారావు : మరి మీ యుగంలో ఫాక్టరీ యజమానులకి పంకాలు వుండవా?

వీరయ్య : అందరికీ వుంటాయి. వర్కర్లకి కూడా.

రాజారావు : ఎండలో ఒకడు బస్తాలు మోస్తూవుంటే, ఇంకోడు వెనక విసు రుతూ వుంటాడా?

కమల : నా సందేహం పోలేదు. వ్యక్తి స్వతం....

వీరయ్య : వ్యక్తి స్వతంత్రం వీల్లేదు. సంఘానికే వ్యక్తిత్వం, ప్రత్యేకంగా వ్యక్తులకి వొప్పుకోము.

కమల : అమ్మో, దుర్నీతీ వుండదు. డబ్బుతో తెచ్చుకునే విలాసాలూ వుండవు. పనిచేసి, తిని, పిల్లల్ని నీతిగా కని, మళ్ళీ తెల్లారి లేచి పని.

వీరయ్య : పోనీలే. ఇప్పటి ఘోరాలు వుండవు.

కమల : అంతా ఘోరమే. అసలు బతుకే ఘోరం. నీ కోపంలో మరచి పోతున్నావుగాని, అట్లాంటి ప్రపంచం తలుచుకో.

వీరయ్య : నేను పోతాను.

రాజారావు : నువ్వు ఇంత శ్రమపడి వొచ్చిన పని?

వీరయ్య : చూస్తానుగా!

శోభనాచలపతి : మానవా?

వీరయ్య : ఏం? నన్ను పోలీసులకి పట్టిస్తారా? జైలునించి వొచ్చి సాధిస్తాను

శోభనాచలపతి : వీరయ్యా! నీకు పని చూపి తిండి పెట్టమని నా కాళ్ళ మీద పడ్డ రోజు జ్ఞాపకం వుందా?

వీరయ్య : ఊఁ! (దిగాలు పడుతున్నాడు).

శోభనాచలపతి : దిగులు పడకు. వెళ్ళు.

(వీరయ్య లేచాడు. కమల అతని దగ్గరికి వెళ్ళి భుజం మీద చెయ్యేసింది)

కమల : వూరికే వాదించాంగాని ఎట్లానూ ప్రజలకే విజయం. చాలా దగ్గిరలో వుంది. పాపం! ఏం చేస్తాం!

వీరయ్య : మరి వొదులుకోరేం మీరు?

శోభనాచలపతి : రానీ రోజు, ధనానికీ, సౌఖ్యాలకీ అలవాటు పడ్డాం. చూస్తూ చూస్తూ వొదులుకులేము. కోపగించకు. సౌందర్యం బూర్జువా. ఆ గుణం నీ చెల్లెలికి పుటకతో వొచ్చింది. నీ చెల్లెలు కార్మికురాలెట్లా అవుతుంది. ధనం కన్న వర్గ అధిక్యం యిస్తుంది సౌందర్యం. దానికేం చేస్తాం చెప్పు. వెళ్ళు. ఈనాడు మాదీ రేపు మీదీ. సంతోషంగా వెళ్ళు.

కమల : ఎట్లానూ కొత్త ప్రపంచం వొస్తోంది. ఇంత త్యాగం చేసి తెచ్చు కునే ఆ మరో ప్రపంచాన్ని నివాసయోగ్యంగా చేసుకోమని నా వాదం, చలం తర్కం.

హృదయించిన ప్రశ్న

అల —

కదే కదే.... కత్.... కదే కదే
కడున్న పాపడి కదే కదే అని
ఆనందంగా ఆపెత్తుకున్నాడో లేదో
ఆదిలోనే అపశృతి
ఏ దొంగ గొడ్డో వాడిని దోషిని చేసి
నాయుడోటి ముందు నిలవెట్టేస్తుంది
సొమ్ముల్ని నీళ్ళకు మళ్ళించాక
చెట్టు కింద కుదల గొడతాడు
వేళ తిరిగినా
కడుపులో ఆకలి సుడులు తిరిగినా
అంబళ్ళ కెళ్ళేవోడు అప్పుడే రాడు
తన ఈడు సొమ్ములోళ్ళు
కళ్ళ ముందున్న తాటి పెంకులు
చేతిలోని మునకాలు
'ఆ....హా!' అని అన్నీ మరిచి
ఆటలో మునిగిపోతాడు
సమయం కోసం చూస్తున్న ఎల్లావు
చల్లగా జారుకుంటుంది
కళ్ళు నెత్తికెక్కేయేటన్న కసుర్లతో పాటు
కళ్ళు బయిర్లు కమ్మడం కన్నీళ్ళు వరదెత్తడం
ఒకదాని వెనుక ఒకటి
వెంట వెంటనే జరిగిపోతాయి
కొట్టడం కాని తేవక్కర్లేని దేశంలో
పుట్టినందుకే వెక్కి వెక్కి ఏడుస్తాడు
కడుపునిండా గంజి పొయ్యడానికి
ఒళ్ళు కప్పుకోడానికి ఓ గుడ్డముక్క ఇవ్వడానికి
లేని నాయుడ[illegible] ఇప్పుడెలా వచ్చిందని
ప్రశ్నించాలనుకుంటాడు
పొంగుతున్న పాలమీద నీటి చుక్క జల్లినట్టు
అయ్య సర్ది చెప్పగా లోలోన తమాయించుకుంటాడు
పొద్దు మునిగినట్టు ప్రశ్నలు ఈరోజు సద్దు మణిగినా
నల్ల గుండెల్లో నాటుకొని
మందే సూర్యుళ్ళయి మొలుస్తాయి

KRSA101M303

PRAJA SAHITI JULY 1994 H/VJ-108 Rs. 5-00

మాకు యుద్ధమే జీవితం !

— రాధేయ

ఇక్కడ మాకు
యుద్ధానికీ, జీవితానికీ తేడా తెలియదు!
నిత్యం పెరిగి, విరిగే ఉద్రేకాల మధ్య
యంత్రాల్లోకి అంతరాత్మల్ని పరకాయ ప్రవేశం చేసి
సహజ లక్షణాలు కోల్పోతున్నప్పుడు...
మాకు యుద్ధానికీ, జీవితానికీ తేడా తెలియదు!
మా హృదయాల గిడ్డంగుల్లో
మౌన ఘోషలు, అశాంతి మూల్గుతున్నంత కాలం
జ్ఞాపకాల మైదానాల్లో నోరు విప్పని గాయాల మచ్చలున్నంత కాలం
మాకు యుద్ధానికీ, జీవితానికీ తేడా తెలియదు!
కరెన్సీల కాల ప్రవాహంలో అంతరాత్మలేని వంచకులంతా
జీవశక్తి లేని రెడీమేడ్ మాటల్ని వల్లె వేస్తున్నప్పుడు
ప్రాణరేఖగా గీసుకున్న స్నేహం ప్రాణభీతితో ఆందోళన చెందుతున్నప్పుడు
మాకు యుద్ధానికీ, జీవితానికీ తేడా తెలియదు!
ఉద్వేగాలు, ఉద్రేకాల మధ్య కల్లోల ఘడియల్లో
నిత్యం ప్రశ్నార్థకాలే చిగురిస్తున్నప్పుడు
వైరుధ్య శకలాలే విస్తరిస్తున్నప్పుడు
మాకు యుద్ధానికీ, జీవితానికీ తేడా తెలియదు!
జన్మ జన్మల అంధత్వం వారసత్వమై
జీవితం వత్తిడికీ, కష్టాలకూ లొంగిపోతున్నప్పుడు
పనిముట్టుగానో, కందెన గానో మిగిలిపోతున్నప్పుడు
మాకు యుద్ధానికీ, జీవితానికీ తేడా తెలియదు!
డిగ్రీల్లోంచి పిండుకున్న విజ్ఞానమంతా
బొట్లుగా రాలుతున్న నైరాశ్యమై
నిరంతర పరిశోధనలన్నీ నిట్టూర్పుల చుట్టుకొలతని విశ్లేషిస్తున్నప్పుడు
మాకు యుద్ధానికీ, జీవితానికీ తేడా తెలియదు!
మాకు యుద్ధమంటే జీవితమే!
మాకు జీవితమంటే యుద్ధమే!!

A Pablication by JANA SAHITI (AP)

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA101M303
పుస్తకం పేరు	ప్రజాసాహితి
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	61
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	[illegible]
లేని పేజీలు	no
తయారు చేసినది	saranya
పేజీలు విడదీసినది	SARANYA
స్కాన్ చేసినది	mary
పరీక్ష చేసినది	ROHITH
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good